ఆదివారం
SUNDAY
8-11-2026

సంపుటి (Volume):2 || సంచిక: (Issue): 130

జగిత్యాల
JAGITIAL

పేజీలు: (PAGES):12
వెల (PRICE): 2.00

Circulated to Telangana
Published from Jagitial

PRGI REGD NO: TGTEL/25/A1385

www.evarthalu.com

నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

అరచేతిలో ఈవార్తలు దినపత్రిక..
స్కాన్ చేయండి.. డౌన్‌లోడ్ చేయండి..
android
GET IT ON Google Play



VANGS
GLOBAL TECHNOLOGIES LLP

ePaper Pro
దీపావళి శుభాకాంక్షలు

DASARA SPECIAL OFFER

Launch Your Cloud-Hosted ePaper Today

Powering modern newsrooms with AI-powered image extraction & multi-language support

20% OFF ON EVERY PLAN

NEWS ONLY website · web stories · breaking news

Standard 5 GB · 5 users — SAVE 20%
- ✓ Automatic PDF extraction
- ✓ Custom domain & push alerts
- ✓ Web stories, gallery, headlines
- ✓ Country & device-wise views

~~₹8,124~~ **₹6,499**
20% OFF · SAVE ₹1,625 / YEAR

Expanded 10 GB · 10 users — SAVE 20%
- ✓ Android app + configuration
- ✓ WhatsApp & email support
- ✓ Theme builder & ID card design
- ✓ Web stories, gallery, headlines

~~₹12,499~~ **₹9,999**
20% OFF · SAVE ₹2,500 / YEAR

Full Press 15 GB · 30 users — SAVE 20%
- ✓ Android app + configuration
- ✓ WhatsApp & email support
- ✓ Theme builder & ID card design
- ✓ Web stories, gallery, headlines

~~₹16,249~~ **₹12,999**
20% OFF · SAVE ₹3,250 / YEAR

ePAPER ONLY PDF to interactive ePaper

Standard 5 GB · 5 users — SAVE 20%
- ✓ Automatic PDF extraction
- ✓ Custom domain & push alerts
- ✓ Unlimited pageviews & SEO
- ✓ Country & device-wise views

~~₹9,999~~ **₹7,999**
20% OFF · SAVE ₹2,000 / YEAR

Expanded 10 GB · 10 users — SAVE 20%
- ✓ WhatsApp & email support
- ✓ Drag & drop theme builder
- ✓ Employee ID card design
- ✓ Custom domain & push alerts

~~₹14,999~~ **₹11,999**
20% OFF · SAVE ₹3,000 / YEAR

Full Press 15 GB · 30 users — SAVE 20%
- ✓ Android app + configuration
- ✓ WhatsApp & email support
- ✓ Theme builder & ID card design
- ✓ Custom domain & push alerts

~~₹19,999~~ **₹15,999**
20% OFF · SAVE ₹4,000 / YEAR

NEWS + ePAPER the complete digital newspaper

Standard 5 GB · 5 users — SAVE 20%
- ✓ Automatic PDF extraction
- ✓ Custom domain & push alerts
- ✓ Web stories, gallery, headlines
- ✓ Country & device-wise views

~~₹17,499~~ **₹13,999**
20% OFF · SAVE ₹3,500 / YEAR

Expanded 10 GB · 10 users — SAVE 20%
- ✓ Android app + configuration
- ✓ WhatsApp & email support
- ✓ Theme builder & ID card design
- ✓ Web stories, gallery, headlines

~~₹22,499~~ **₹17,999**
20% OFF · SAVE ₹4,500 / YEAR

Full Press 15 GB · 30 users — BEST VALUE
- ✓ Android app + configuration
- ✓ WhatsApp & email support
- ✓ Theme builder & ID card design
- ✓ Web stories, gallery, headlines

~~₹32,499~~ **₹25,999**
20% OFF · SAVE ₹6,500 / YEAR

PLATFORM HIGHLIGHTS

- ◆ Smart AI image extraction
- ◆ AdSense & sponsor ad slots
- ◆ Custom domain + auto SSL
- ◆ One-click publishing
- ◆ WhatsApp sharing
- ◆ AI tagging & SEO tags
- ◆ Real-time analytics
- ◆ AWS cloud · daily backups
- ◆ YouTube video embedding

Try free for 12 days

No credit card required · Turn your print edition into a digital publication

CALL / WHATSAPP
+91 7675087378

EMAIL
hr@vangstechnologies.com

WEBSITE
www.vangstechnologies.com

SCAN TO VISIT OUR WEBSITE

SCAN TO CALL +91 7675087378

రాశి ఫలాలు

8.11.2026

మేషం: ఉద్యోగమున అధికారులతో జాగ్రత్త అవసరం. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. సోదరులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. ఆర్థిక విషయాలు నిరాశ పరుస్తాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం.

వృషభం: సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. సన్నిహితుల నుంచి ధనలాభ సూచనలున్నవి. చేపట్టిన పనుల్లో విజయం సాధిస్తారు. వ్యాపారాలు, ఉద్యోగాలు సజావుగా సాగుతాయి. ఆప్తుల నుండి శుభవార్తలు అందుతాయి. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి.

మిథునం: బంధువుల నుంచి ఒక వ్యవహారంలో ఒత్తిడి తప్పదు. మిత్రులతో చిన్నపాటి విభేదాలు ఉంటాయి. ఆర్థిక విషయాలు నిరాశ పరుస్తాయి. ఉద్యోగాలలో నిరుత్సాహం తప్పదు. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. నూతన ఋణాలు చేస్తారు. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి.

కర్కాటకం: గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. ఇంటా బయట అనుకూల పరిస్థితులు ఉంటాయి. నిరుద్యోగుల శ్రమ ఫలిస్తుంది. కొత్త వ్యక్తుల పరిచయాలు ఆనందాన్నిస్తాయి. వ్యాపార, ఉద్యోగాలలో మరింత ఉత్సాహకర వాతావరణం ఉంటుంది. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

సింహం: గృహమున ఆశ్చర్యకరమైన సంఘటనలు చోటుచేసుకుంటాయి. చేపట్టిన పనులు విజయవంతమవుతాయి. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. వృత్తి ఉద్యోగాలలో పైచేయి సాధిస్తారు. గృహ నిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. ఉద్యోగమున మీ ప్రతిభ వెలుగులోకి వస్తుంది.

కన్య: వ్యాపార, ఉద్యోగాలలో మరింత అనుకూల వాతావరణం ఉంటుంది. చేపట్టిన పనులు నిదానంగా సాగుతాయి. ఆప్తుల సలహాలు కలసివస్తాయి. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. సన్నిహితులతో వివాదాలు పరిష్కారమౌతాయి.

తుల: సోదరులతో మాటపట్టింపులుంటాయి. ముఖ్యమైన పనులు వాయిదా పడుతాయి. స్వల్ప ఆరోగ్య సమస్యలు భాధిస్తాయి. వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. ఉద్యోగాలలో కాస్త నిరుత్సాహం తప్పదు. కుటుంబ విషయంలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. ఇంటా బయట చికాకులు పెరుగుతాయి.

వృశ్చికం: కొన్ని సంఘటనలు ఆశ్చర్యపరుస్తాయి. నూతన వ్యక్తుల పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి. వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి. ఉద్యోగాలలో అధికారుల ఆదరణ పెరుగుతుంది. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. పాతబాకీలు వసూలవుతాయి. పనులు వేగవంతం చేస్తారు.

ధనస్సు: నూతన వాహన యోగమున్నది. సన్నిహితులతో విందువినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. చిన్ననాటి మిత్రులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. వ్యాపార, ఉద్యోగాలు సాఫీగా సాగుతాయి. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. ఆప్తుల నుంచి ఆహ్వానాలు అందుతాయి.

మకరం: వ్యాపార విస్తరణకు అవరోధాలు కలుగుతాయి. మీ ఆలోచనలు ఇతరులకు నచ్చవు. ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు ఉంటాయి. ఉద్యోగాలలో సహోద్యోగులతో సమస్యలు తప్పవు. నూతన ఋణాలు చేస్తారు. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. బంధువర్గంతో మాటపట్టింపులుంటాయి.

కుంభం: వ్యాపారాలు మందకోడిగా సాగుతాయి. ఉద్యోగాలలో రావలిసిన పదవులు చేజారుతాయి. చేపట్టిన పనులు మధ్యలో వాయిదా వేస్తారు. ఆలోచనలు నిలకడగా ఉండవు. దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు. కుటుంబ సభ్యులతో ఆలోచించి మాట్లాడాలి. నిరుద్యోగ ప్రయత్నాలు నిరాశ పరుస్తాయి.

మీనం: స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. వ్యాపారాలలో ముఖ్య నిర్ణయాలు అమలు పరుస్తారు. ఉద్యోగాలలో సమస్యలు పరిష్కారమౌతాయి. ఆత్మీయుల నుంచి శుభవార్తలు అందుతాయి. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు.

వానల్లేవ్..నీళ్లు లేవ్!

మొదటి పేజీ తరువాయి

మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా ఈ సీజన్‌లో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవచ్చని పేర్కొన్నారు. మరోవైపు ఎండలు తీవ్రంగా ఉండే పరిస్థితులు కనిపిస్తున్నాయని చెప్పారు. ఈ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులు ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితులను వివరిస్తూ వచ్చే జూలై వరకు వర్షాలు లేకపోవచ్చని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పంటలు వేసే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. నీరు ఎక్కువగా అవసరమయ్యే పంటల సాగుతో ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని.. అందువల్ల ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. రైతులను తప్పుదోవ పట్టించే ప్రచారాలను నమ్మవద్దని అన్నారు. 'మీకన్నా నాకు ఆత్మబంధువులు ఎవరూ లేరు. కష్టకాలంలో ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది. మనమంతా ఏకమై ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొందాం' అని రేవంత్ రెడ్డి రైతులకు పిలుపునిచ్చారు. సంక్రాంతి తర్వాత ప్రజాబలం కార్యక్రమం చేపట్టి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తానని.. రైతులు, ప్రజల సమస్యలను తెలుసుకుంటానని తెలిపారు. రాష్ట్రంలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయని ముఖ్యమంత్రి రేవంత్ అన్నారు. గతంలో ఈ సమయానికి వందల టీఎంసీల నీరు అందుబాటులో ఉండేదని.. ఇప్పుడు కొన్ని ప్రాజెక్టుల్లో నీటి మట్టాలు అడుగంటుతున్నాయని పేర్కొన్నారు. కరవు పరిస్థితులపై కొందరు చేస్తున్న వ్యాఖ్యల నేపథ్యంలో సాగునీటి ప్రాజెక్టుల వాస్తవ పరిస్థితులను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. మేడిగడ్డ బరాజ్ దెబ్బతినడం వల్ల కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా నీటిని ఎత్తిపోసే ప్రక్రియకు



ఇబ్బందులు ఎదురవుతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. మేడిగడ్డ గేట్లు మూసి 16 టీఎంసీల నీటిని నిల్వ చేసినప్పుడే పంప్‌హౌస్‌లోకి నీరు చేరి ఎత్తిపోతలకు అవకాశం ఉంటుందని చెప్పారు. గోదావరిలో నీరు పారుతున్నప్పుడు దాన్ని ఎత్తిపోసేందుకు బరాజ్‌లు ఎందుకు అవసరమనే ప్రశ్నలకు కూడా ఆయన సమాధానమిచ్చారు. తుపాకులగూడెం వద్ద నీటిని నిల్వ చేసి దేవాదుల ప్రాజెక్టు ద్వారా ఎత్తిపోస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఖమ్మం ప్రాంతంలో సీతారామ ప్రాజెక్టు ద్వారా ఆ నీటిని వినియోగిస్తున్నామని తెలిపారు. నీటిని ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తున్నారనే విమర్శలను ముఖ్యమంత్రి తీవ్రంగా ఖండించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లకు సంబంధించి కూడా వివరణ ఇచ్చారు. ఈ 3 బరాజ్‌లు పనిచేసినప్పుడే శ్రీపాద ఎల్లంపల్లికి నీరు చేరుతుందని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావం, రాష్ట్రంలో ఏర్పడే కరవు పరిస్థితులు, కాళేశ్వరం ప్రాజెక్టు, గోదావరి, కృష్ణా జలాల వినియోగంపై డిసెంబర్‌లో అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 2, 3 రోజుల పాటు సమావేశాలు నిర్వహించి అన్ని అంశాలపై సమగ్రంగా చర్చిస్తామని చెప్పారు. ప్రాజెక్టుల పరిస్థితి, నీటి లభ్యత, భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు పూర్తి వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు. పాలమూరు ప్రాంతంలో దశాబ్దాలుగా తాగునీరు, సాగునీటి సమస్యలు కొనసాగుతున్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఈ ప్రాంత ప్రజల జీవితాల్లో మార్పు వస్తుందని ఆశించినా అనేక సాగునీటి ప్రాజెక్టులు పూర్తికాలేదని విమర్శించారు. కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, పాలమూరు-రంగారెడ్డి, మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాల పనులపై గత ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎస్ఎల్‌బీసీ పూర్తయి ఉంటే నల్గొండలో ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి తోడ్పడేదని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అచ్చంపేట ఎత్తిపోతల, సీతారామసాగర్ వంటి ప్రాజెక్టులు కూడా పూర్తికాలేదని అన్నారు.

వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును ప్రారంభించి చేవెళ్ల, వికారాబాద్, తాండూరు వరకు నీటిని తరలించాలని ప్రణాళిక రూపొందించారని, అప్పట్లో రూ.15 వేల కోట్లు ఖర్చు చేశారని గుర్తుచేశారు. కొడంగల్ ప్రాంతంలో మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులు వేగంగా కొనసాగుతున్నాయని సీఎం తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం రైతులు భూములు ఇచ్చేందుకు ముందుకొచ్చారని.. ఎకరాకు రూ.20 లక్షల పరిహారం చెల్లించి భూసేకరణ చేపట్టామని చెప్పారు. హైదరాబాద్ నుంచి లగచర్ల వరకు పారిశ్రామిక ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని.. ఢిల్లీ-నోయిడా, ముంబై-పుణె తరహాలో ఈ ప్రాంతాన్ని తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి కొడంగల్ వరకు 250 అడుగుల రహదారి నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో పరిశ్రమలు వస్తే స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ (రేర్)లో భాగంగా కొడంగల్‌ను విద్యా కేంద్రంగా అభివృద్ధి చేయనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. మెడికల్, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, నర్సింగ్, వెటర్నరీ, లా కళాశాలలతో పాటు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, సైనిక్ స్కూల్ ఏర్పాటు వంటి ప్రణాళికలను ప్రస్తావించారు. పారిశ్రామిక పార్కుల అభివృద్ధితో ఈ ప్రాంతానికి కొత్త అవకాశాలు వస్తాయని, సుమారు రూ.10 వేల కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

గంటకు 503 కి.మీ స్పీడ్

మొదటి పేజీ తరువాయి

చైనా సంస్థ బీవైడీ మరో స్థాయికి తీసుకెళ్లింది. సంస్థకు చెందిన అత్యంత ఖరీదైన యాంగ్‌వాంగ్ యూ9 ఎక్స్‌ట్రీమ్ కారు అబుదాబిలోని అల్ ధఫ్రా ప్రాంతంలో షేక్ ఖలీఫా బిన్ జాయెద్ అంతర్జాతీయ రహదారి (ఈ11)పై నిర్వహించిన హైస్పీడ్ పరీక్షలో గంటకు 503.17 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంది. ప్రొఫెషనల్ రేసింగ్ డ్రైవర్ మార్క్ బాసెంగ్ ఈ కారును నడిపారు. గతంలో 2025 సెప్టెంబర్‌లో జర్మనీలోని ఏటీపీ పాపెన్‌బర్గ్ పరీక్షా కేంద్రంలో సాధించిన గంటకు 496.22 కిలోమీటర్ల వేగాన్ని ఈసారి అధిగమించింది. ఈ రికార్డును అంతర్జాతీయ ఆటోమొబైల్ సమాఖ్య (ఎఫ్ఐఏ) గుర్తించగా, గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ కూడా ఒకే దిశలో ప్రయాణించిన ఉత్పత్తి కారుతోపాటు ఎలక్ట్రిక్ ఉత్పత్తి కారు విభాగాల్లో అత్యధిక వేగ రికార్డులుగా గుర్తించింది. ఈ కారు ప్రత్యేకత దాని అత్యాధునిక సాంకేతికతలో ఉంది. ఇందులో 1,200 వోల్టుల హై-వోల్టేజ్ వ్యవస్థ, నాలుగు స్వతంత్ర ఎలక్ట్రిక్ మోటార్లు ఉన్నాయి. ఇవి నిమిషానికి 30వేల ఆర్‌పీఎం వేగంతో తిరుగుతాయి. నాలుగు మోటార్లు కలిపి 3వేల పీఎస్‌కు పైగా శక్తిని ఉత్పత్తి చేస్తాయి. మొత్తం పవర్ అవుట్‌పుట్ 2,220 కిలోవాట్లుగా ఉంది. కారు చక్రాలకు శక్తిని పంపిణీ చేసే టార్క్ వెక్టరింగ్ వ్యవస్థ సెకనుకు 100 సార్లకు పైగా సర్దుబాట్లు చేస్తుంది. అధిక వేగాన్ని తట్టుకునేందుకు ప్రత్యేక టైర్లు, బ్రేకింగ్ వ్యవస్థ, కూలింగ్ టెక్నాలజీ, కార్బన్ ఫైబర్ ఫ్రంట్ స్ప్లిటర్, రియర్ డిఫ్యూజర్, ప్రత్యేక వెనుక వింగ్‌ను ఏర్పాటు చేశారు. గతంలో 2025 ఆగస్టులో జర్మనీలోని నూర్‌బర్గ్‌రింగ్ నార్డ్‌ష్లైఫ్ ట్రాక్‌ను 6 నిమిషాల 59.157 సెకన్లలో పూర్తి చేసి, ఎలక్ట్రిక్ ఉత్పత్తి కార్ల విభాగంలో ల్యాప్ రికార్డును కూడా సాధించింది. ఈ రికార్డు కోసం ప్రత్యేక రేసింగ్ ట్రాక్‌కు బదులుగా ప్రజా రహదారిలోని 10 కిలోమీటర్ల మూసివేసిన మార్గాన్ని ఉపయోగించారు. ఇందులో ఏడు కిలోమీటర్ల పొడవైన నేరుగా ఉండే రహదారి భాగం ఉంది. అధిక ఉష్ణోగ్రతలు, ఎదురుగాలులు, ఎడారి దుమ్ము వంటి సవాళ్లను అధిగమించి కారు ఈ వేగాన్ని అందుకుంది. అయితే ఈ హైపర్‌కారు అందరికీ అందుబాటులో ఉండదు. ప్రపంచవ్యాప్తంగా కేవలం 30 కార్లకు మాత్రమే ఉత్పత్తిని పరిమితం చేస్తున్నట్లు బీవైడీ ప్రకటించింది. ఇప్పటికే కొంతమంది కస్టమర్లు తమకు కావాల్సిన ప్రత్యేక మార్పులకు ఆమోదం తెలిపి, ఒప్పందాలు, ఉత్పత్తి షెడ్యూలింగ్ ప్రక్రియ దిశగా ముందుకెళ్లారు. పెట్రోల్ హైపర్‌కార్ల ఆధిపత్యానికి సవాల్ విసురుతూ, ఎలక్ట్రిక్ వాహనాలు కూడా అత్యంత వేగవంతమైన కార్ల విభాగంలో సత్తా చాటగలవని బీవైడీ నిరూపించింది.

నిర్బంధ పదవీ విరమణ తప్పు కాదు

మొదటి పేజీ తరువాయి

లేవని, లేదా వారి పనితీరు మందగించిందని భావించినప్పుడు ఎగ్జిక్యూటివ్ అథారిటీ తగిన నిర్ణయం తీసుకోవచ్చని కోర్టు స్పష్టం చేసింది. అయితే ఈ నిర్ణయం కేవలం ఎవరి వ్యక్తిగత కక్షలకు అనుగుణంగా ఉండకూడదని, ఉద్యోగి వార్షిక పని తీరు నివేదికలు, నిజాయితీ వంటి స్పష్టమైన ఆధారాలపై మాత్రమే ఆధారపడి ఉండాలని సూచించింది. తమతో పాటు సమానమైన సర్వీసు రికార్డులు ఉన్న కొందరిని సర్వీసులో కొనసాగించి, తమను మాత్రం నిర్బంధంగా రిటైర్ చేయడం వివక్ష కిందకు వస్తుందని బాధితులు వాదించగా.. సుప్రీంకోర్టు ఆ వాదనను పూర్తిగా తోసిపుచ్చింది. ఉద్యోగుల పనితీరు అనేది ఎవరికివారే ప్రత్యేకంగా జరిగే ప్రక్రియ అని, మరొకరికి మినహాయింపు దక్కిందనే కారణంతో చట్టవిరుద్ధమైన డిమాండ్లు చేయడం కుదరదని తేల్చిచెప్పింది. ఇలాంటి ప్రభుత్వ నిర్ణయాలపై న్యాయస్థానాలు చేసే సమీక్ష చాలా పరిమితంగా ఉంటుందని కోర్టు పునరుద్ఘాటించింది. అధికారులు సరైన నిబంధనలను పాటించారా, సరైన ఆధారాలను పరిగణనలోకి తీసుకున్నారా లేదా అనే కోణంలో మాత్రమే కోర్టులు పరిశీలిస్తాయని, అధికారుల స్థానంలో తాము కూర్చుని తీర్పులు మార్చలేమని వెల్లడించింది. చత్తీస్‌గఢ్ ప్రభుత్వ నిర్ణయంలో ఎలాంటి దురుద్దేశాలు లేవని, నిబంధనల ప్రకారమే స్క్రీనింగ్ కమిటీ పారదర్శకంగా వ్యవహరించిందని స్పష్టం చేస్తూ.. ఈ విషయంలో కింది కోర్టులు, హైకోర్టు ఇచ్చిన తీర్పులనే సుప్రీంకోర్టు సమర్థించింది.

ఆకాశమే హద్దు..!

మొదటి పేజీ తరువాయి

వీడియోను వాయుసేన సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. విమానం సామర్థ్యంతోపాటు సిబ్బంది నైపుణ్యం, కచ్చితత్వం, వృత్తి నైపుణ్యానికి ఈ విజయం నిదర్శనమని పేర్కొంది. దేశ వ్యూహాత్మక రవాణా సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే కీలక ముందడుగుగా అభివర్ణించింది. చైనా సరిహద్దులోని వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ)కి సమీపంలో న్యోమా ఎయిర్‌ఫీల్డ్ ఉంది. సరిహద్దుకు సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో సైనికపరంగా దీనికి ఎంతో ప్రాధాన్యం ఉంది. ఇక్కడి ఎత్తైన ప్రాంతాల్లో గాలి సాంద్రత తక్కువగా ఉంటుంది. దీంతో విమానాలకు ఇంజిన్ పనితీరు, గాల్లోకి లేచే సామర్థ్యం తగ్గుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో భారీ రవాణా విమానాన్ని సురక్షితంగా దించడం సవాలుతో కూడుకున్న పని. రష్యా మూలాలున్న ఐఎల్-76ఎండీ నాలుగు ఇంజిన్ల భారీ రవాణా విమానం. సైనికులు, ఆయుధ సామగ్రి, ఇతర భారీ సరకులను మారుమూల ప్రాంతాలకు తరలించేందుకు వాయుసేన దీన్ని వినియోగిస్తోంది. న్యోమాలో ఈ విమానం ల్యాండింగ్ కావడం సరిహద్దు ప్రాంతాల్లో సైనిక అవసరాలకు వేగంగా స్పందించే భారత సామర్థ్యాన్ని చాటిందని రక్షణ రంగ వర్గాలు పేర్కొంటున్నాయి.

'పరిషత్తూ..' కూటమిదే!

మొదటి పేజీ తరువాయి

(ఎక్స్‌గ్రేషియాతో కలిపి 8), వైసీపీ 19 స్థానాలు (ఎక్స్‌గ్రేషియాతో కలిపి 20) సాధించాయి. ఇతరులు ఒక స్థానంలో విజయం సాధించారు. కడప జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఫలితాల్లో టీడీపీ అభ్యర్థులు భారీ విజయం సాధించారు. వైసీపీకి పట్టున్న ప్రాంతాల్లోనూ కూటమి అభ్యర్థులు గణనీయమైన ఆధిక్యంతో గెలుపొందారు. పులివెందుల, మైదుకూరు వంటి ప్రాంతాల్లోనూ కూటమి అభ్యర్థులు తమ సత్తా చాటారు. పులివెందులలో 1,463 ఓట్ల మెజారిటీతో టీడీపీ అభ్యర్థి విజయం సాధించగా, మైదుకూరులో 18,903 ఓట్ల మెజారిటీతో టీడీపీ అభ్యర్థి గెలుపొందారు. పలు ప్రాంతాల్లోనూ కూటమి అభ్యర్థులు వైసీపీకి గట్టి షాక్ ఇచ్చారు.

ఎంపీటీసీ స్థానాల్లోనూ ఆధిపత్యం

రాష్ట్రవ్యాప్తంగా ఎంపీటీసీ స్థానాల్లోనూ కూటమి పార్టీలే పైచేయి సాధించాయి. శనివారం రాత్రి 9 గంటల వరకు వెల్లడించిన ఫలితాల ప్రకారం.. తెలుగుదేశం పార్టీ 3,043 స్థానాలు, జనసేన 537 స్థానాలు, బీజేపీ 77 స్థానాలు గెలుచుకున్నాయి. వైసీపీ 1,050 స్థానాల్లో విజయం సాధించగా, ఇతరులు 14 స్థానాలు, స్వతంత్రులు 20 స్థానాల్లో గెలుపొందారు. మొత్తంగా పరిషత్తు ఎన్నికల్లో కూటమి స్పష్టమైన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది.



ఎమర్జెన్సీ తప్పే!

మొదటి పేజీ తరువాయి

1977 మార్చిలో ఎన్నికలకు పిలుపునిచ్చారని సోనియా గుర్తుచేశారు. నవంబరు 10న సోనియా రాసిన 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ ఇంటర్వ్యూను రాహుల్‌గాంధీ ఎక్స్‌లో పంచుకున్నారు. ప్రజా జీవితంలో ఆరు దశాబ్దాలు గడిచినా తన తల్లి వ్యక్తిత్వం మారలేదని, ఆమె తన తల్లి కావడం గర్వంగా ఉందని పేర్కొన్నారు.

ట్రంప్‌కు హనుమాన్ చాలీసా బహుమతి

మొదటి పేజీ తరువాయి

ట్రంప్ స్వయంగా దీపం వెలిగించి వేడుకలను ప్రారంభించారు. ఈ వేడుకకు అమెరికాలోని భారత రాయబారి వినయ్ మోహన్ క్వాత్రా, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ డైరెక్టర్ జయ్ భట్టాచార్య వంటి ప్రముఖులు హాజరయ్యారు. వీరితో పాటు మైక్రాన్ టెక్నాలజీ సీఈఓ సంజయ్ మెహ్రోత్రా, ఐబీఎం సీఈఓ అరవింద్ కృష్ణ, ప్రముఖ చెఫ్ వికాస్ ఖన్నా, సోషల్ సెక్యూరిటీ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ కమిషనర్ అర్జున్ మోదీ కూడా ఈ వేడుకల్లో పాలుపంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఒక ఆసక్తికరమైన సంఘటన చోటుచేసుకుంది. ప్రముఖ పారిశ్రామికవేత్త, జీఓక్యూఐఐ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు విశాల్ గోండల్, అధ్యక్షుడు ట్రంప్‌కు 'హనుమాన్ చాలీసా' పుస్తకాన్ని బహూకరించారు.



భూతల్లికి దూప

మొదటి పేజీ తరువాయి

మట్టాలు 15 మీటర్లకు పైగా లోతుకు చేరాయి. ఈ దుస్థితికి ప్రధాన కారణం వర్షాభావమే. జూన్ 1 నుంచి అక్టోబర్ 31 వరకు హైదరాబాద్ పట్టణ ప్రాంతంలో సాధారణ వర్షపాతం 729 మి.మీ. కాగా, కేవలం 484 మి.మీ. వర్షం మాత్రమే కురిసింది. ఇది సుమారు 34% లోటు. భూగర్భ జలాలు అడుగంటడంతో ప్రజలు వాటర్ ట్యాంకర్లపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ అక్టోబర్ 2025లో 87,056 ట్యాంకర్లను సరఫరా చేయగా, ఈ ఏడాది అక్టోబర్‌లో ఆ సంఖ్య 2,20,887కి చేరింది. ఇది సుమారు 153.7% పెరుగుదల. ఈ నేపథ్యంలో, అక్రమ బోరుబావులపై హైడ్రా చర్యలు చేపట్టింది. మరోవైపు, నీటి వృథాను అరికట్టేందుకు హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ 'పానీ' అనే మొబైల్ యాప్‌ను ప్రవేశపెట్టింది. "ప్రతి ఒక్కరూ రోజుకు 20 నుంచి 25 లీటర్ల నీటిని ఆదా చేస్తే, మన కార్యకలాపాలకు ఆటంకం లేకుండా నీటిని పొదుపు చేయవచ్చు" అని హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ మేనేజింగ్ డైరెక్టర్ కె. అశోక్ రెడ్డి సూచించారు. వర్షపు నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ వంటి చర్యలు చేపట్టాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఆదివారం
SUNDAY
8-11-2026

సంపుటి (Volume):2 || సంచిక: (Issue): 130

జగిత్యాల
JAGITIAL

పేజీలు: (PAGES):12
వెల (PRICE): 2.00

Circulated to Telangana
Published from Jagitial

PRGI REGD NO: TGTEL/25/A1385

www.evarthalu.com

నేటి ఈవార్తలు

NETI EVARTHALU





చీకటిపై వెలుగు, చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి ప్రతీక దీపావళి. ప్రతి ఇంటా ఆనందాల వెలుగులు విరజిమ్ముతూ, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలి. ఈ దీపాల పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఆశలు, నూతన ఆలోచనలు, విజయాలను నింపాలి. సమాజంలో ప్రేమాభిమానాలు, ఐక్యత, సోదరభావం మరింత బలపడాలి. పేద, ధనిక అనే తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు నిండాలి. ప్రజలందరూ దీపావళిని జరుపుకుంటూ ఆనందాలను పంచుకోవాలని కోరుకుంటూ..

ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు!

- ఇట్లు

బొమ్మకంటి గంగాధర్, చైర్మన్, ఈవార్తలు దినపత్రిక



రామ 'జ్యోతి'

30 లక్షల దీపకాంతుల్లో అయోధ్యాపురి

అయోధ్యలో భక్తి, ఆధ్యాత్మికత, సంస్కృతి ఉట్టిపడేలా శనివారం నిర్వహించిన దీపోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. ఏకంగా 30 లక్షల దీపాల వెలుగులతో అయోధ్య నగరం దేదీప్యమానంగా వెలిగిపోయింది. ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్, గవర్నర్ ఆనందీబెన్ పటేల్ వేడుకల్లో పాల్గొన్నారు. సాకేత్ కళాశాల నుంచి ఉదయం ప్రారంభమైన శ్రీరామ పట్టాభిషేక శోభాయాత్ర దాదాపు మూడు కిలోమీటర్లు సాగి రామ్‌కథా పార్క్‌కు చేరుకుంది. 14 రాష్ట్రాలకు చెందిన 500 మందికి పైగా కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, రామాయణ ఇతివృత్తంతో రూపొందించిన శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దారిపొడవునా జైశ్రీరామ్ నినాదాలు మార్మోగాయి.

దీపావళి సందర్భంగా 'ఈవార్తలు' దినపత్రికకు ఆదివారం సెలవు. కాబట్టి సోమవారం సంచిక వెలువడదు. పునర్దర్శనం మంగళవారం.

- ఎడిటర్



ఎమర్జెన్సీ తప్పే!

ప్రజాస్వామ్య హక్కులకు భంగం కలిగింది.. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ వెల్లడి

ఎమర్జెన్సీ సమయంలో ని జరిగిన అకృత్యాలపై మాజీ ప్రధాని ఇందిరాగాంధీ తర్వాతి కాలంలో పశ్చాత్తాపం వ్యక్తం చేశారని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ తెలిపారు. ఆ ఘటనలకు బహిరంగంగా క్షమాపణలు కూడా చెప్పారని వెల్లడించారు. ఎమర్జెన్సీకి సంజయ్‌గాంధీ ఒక్కరినే బాధ్యుడిగా చూడకూడదని స్పష్టం చేశారు. 'ది హిందూ' పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సోనియా ఈ విషయాలు వెల్లడించారు.



న్యూఢిల్లీ: ఎమర్జెన్సీ అనగానే ప్రజలకు సంజయ్‌గాంధీ గుర్తుకొస్తారని అన్నారు. కానీ అప్పట్లో ఇందిరాగాంధీపై సీనియర్ నేతల నుంచి కూడా ఒత్తిడి ఉండేదని చెప్పారు. ఆమె చుట్టూ భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తం చేసినవారిలో రాజీవ్‌గాంధీ కూడా ఉన్నారని తెలిపారు. ప్రజలు చెప్పిన సమస్యలు, ఫిర్యాదులను రాజీవ్ తన తల్లి దృష్టికి తీసుకెళ్లేవారని పేర్కొన్నారు. ఎమర్జెన్సీ సమయంలో ప్రజాస్వామ్య హక్కులు నిలిపివేశారని సోనియా అంగీకరించారు. హేబియస్ కార్పస్ హక్కును కూడా రద్దు చేశారని చెప్పారు. అయితే అప్పటి పరిస్థితులు ఇందిరాగాంధీని తీవ్ర ఒత్తిడికి గురిచేశాయని వివరించారు. హింసాత్మక ఆందోళనలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా రవాణా వ్యవస్థపై దాడులు జరిగాయని గుర్తుచేశారు. ప్రభుత్వ అధికారులు, సాయుధ దళాలు ఆదేశాలను ధిక్కరించాలన్న పిలుపులు కూడా వచ్చాయని తెలిపారు. తర్వాత పరిస్థితులను అర్థం చేసుకున్న ఇందిరాగాంధీనే తరువాయి 2 వ పేజీలో...



నిర్బంధ పదవీ విరమణ తప్పు కాదు

ఉద్యోగి ప్రవర్తనపై మచ్చ పడదు: సుప్రీం కోర్టు

ప్రభుత్వ ఉద్యోగికి ఇచ్చే నిర్బంధ పదవీ విరమణ (కంపల్సరీ రిటైర్మెంట్) ఉత్తర్వులు ఎంతమాత్రం శిక్షాత్మకమైనవి లేదా వారి ప్రవర్తనపై ఎలాంటి మచ్చ తెచ్చేవి కావు అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పరిపాలనా సామర్థ్యాన్ని మెరుగుపరచడం, ప్రజా ప్రయోజనాలను కాపాడటం కోసం అర్హులైన ఉద్యోగులను సర్వీసు నుంచి ముందస్తుగా రిటైర్ చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుందని అత్యున్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది.

న్యూఢిల్లీ:ప్రభుత్వ ఉద్యోగి సేవా రికార్డులను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకుంటారు కాబట్టి, ఇది సదరు ఉద్యోగిపై ఎలాంటి నేరారోపణ లేదా క్రమశిక్షణా చర్య కిందకు రాదని ధర్మాసనం పేర్కొంది. చత్తీస్‌గఢ్ ప్రభుత్వం 2017 సర్క్యులర్ ప్రకారం 14 మందిలో ఐదుగురు ఉద్యోగులకు ఇచ్చిన నిర్బంధ పదవీ విరమణను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన జస్టిస్ మన్మోహన్, జస్టిస్ శ్రీ చంద్రశేఖర్‌లతో కూడిన ధర్మాసనం ఈ కీలక తీర్పు వెలువరించింది. ఉద్యోగి సేవలు ఇకపై ప్రభుత్వానికి లేదా ప్రజలకు ఉపయోగపడేలా



వానల్లేవ్..నీళ్లు లేవ్!

వచ్చే 8 నెలలు వర్షాలు పడవు.. తాగడానికే ప్రాజెక్టుల్లోని నీళ్లు

రైతులు ఆరుతడి పంటలే వేయాలి.. పాలమూరుకు కేసీఆర్ చేసింది సున్నా

గడ్డం పెంచుకుంటే నాలా కాలేరు.. కొడంగల్ సభలో సీఎం రేవంత్ రెడ్డి

ఎల్‌నినో ప్రభావంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక సూచనలు చేశారు. ఈ దెబ్బతో రాష్ట్రంలో వర్షాలు తగ్గడమే కాకుండా.. ఎండలు కూడా పెరిగే అవకాశాలు ఉన్న నేపథ్యంలో రైతులు అలర్ట్‌గా ఉండాలని పేర్కొన్నారు. వచ్చే 8 నెలలు గడ్డు పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. పంటలు సాగు చేసే ముందు రైతులు నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకోవాలని కోరారు. నీరు తక్కువగా అవసరమయ్యే ఆరుతడి పంటల వైపు రైతులు మొగ్గు చూపాలని విజ్ఞప్తి చేశారు.

కొడంగల్, నవంబర్ 7 (ఈవార్తలు ప్రత్యేక ప్రతినిధి): కష్టకాలంలో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని హకీంపేటలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మెగా రైతు మేళా, పారిశ్రామిక ప్రదర్శనను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆదర్శ రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని తరువాయి 2 వ పేజీలో...

బంగారం-వెండి ధరలు



బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

గ్రాము-24 క్యారెట్స్):	రూ.14,357
వెండి (కిలో):	రూ.2,05,000
ప్లాటినం (గ్రాము):	రూ.4,582

విశ్వవాణి



రాత్రి పడుకునే ముందు తాగే వెచ్చని పసుపు పాలు (గోల్డెన్ మిల్క్) జీర్ణవ్యవస్థకు కొన్ని విధాలుగా మేలు చేయవచ్చని పరిశోధనలు సూచిస్తున్నాయి. పసుపు, అల్లం, దాల్చినచెక్క, మిరియాల పొడి, మొక్కల ఆధారిత పాలు కలిపి ఈ పానీయాన్ని తయారు చేస్తారు. ఇందులోని పసుపులో ఉండే కర్కుమిన్ అనే పదార్థానికి వాపును తగ్గించే గుణాలు ఉన్నాయి. ఇవి పేగుల్లో వాపు తగ్గించేందుకు తోడ్పడవచ్చు. దాల్చినచెక్క, అల్లంలోనూ వాపు నిరోధక లక్షణాలున్న పదార్థాలు ఉంటాయి. మిరియాల్లోని పైపరిన్ శరీరం కర్కుమిన్‌ను ఎక్కువగా గ్రహించేందుకు సహాయపడుతుందని పేర్కొన్నారు.

భూతల్లికి దూప

హైదరాబాద్‌కు నీటి గండం

అడుగంటుతున్న భూగర్భ జలాలు.. తాగునీటి లభ్యతపై ఆందోళన



హైదరాబాద్‌కు నీటి గండం పొంచి ఉంది. నగరం, దాని చుట్టుపక్కల మున్సిపల్ ప్రాంతాల్లో భూగర్భ జల మట్టాలు ప్రమాదకర స్థాయిలో పడిపోతున్నాయి. వర్షాభావ పరిస్థితులు, బోరుబావులపై ఆధారపడటం పెరగడంతో రాబోయే నెలల్లో తాగునీటి లభ్యతపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. తెలంగాణ భూగర్భ జల శాఖ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, 2026 సెప్టెంబర్, అక్టోబర్ నెలల మధ్య కేవలం ఒక్క నెలలోనే నగరంలో నగటు భూగర్భ జల మట్టం 1.01 మీటర్ల మేర పడిపోయింది.

హైదరాబాద్, నవంబర్ 7 (ఈవార్తలు): భూగర్భ జల శాఖ అక్టోబర్ నివేదిక ప్రకారం, గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి కార్పొరేషన్ల పరిధిలో సెప్టెంబర్‌లో భూమికి 11.58 మీటర్ల లోతులో ఉన్న నీటి మట్టం, అక్టోబర్ నాటికి 12.59 మీటర్లకు పడిపోయింది. గతేడాది అక్టోబర్ 2025లో ఇదే ప్రాంతంలో సగటు నీటి మట్టం కేవలం 5.42 మీటర్ల లోతులోనే ఉండగా, ఈ ఏడాది ఏకంగా 7.17 మీటర్లు పడిపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. నగరంలోని 46 మండలాల్లో 107 పీజోమీటర్ల ద్వారా ఈ వివరాలను సేకరించినట్లు 'ది హిందూ' పత్రిక తన కథనంలో పేర్కొంది. నగరంలోని పలు ప్రాంతాల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. కూకట్‌పల్లిలో అత్యధికంగా 22.88 మీటర్ల లోతుకు నీటి మట్టం పడిపోగా, శంకర్‌పల్లిలో 21.81 మీటర్లు, మేడిపల్లిలో 20.31 మీటర్ల లోతులో నమోదైంది. అమీర్‌పేట, కుత్బుల్లాపూర్, సరూర్‌నగర్, పటాన్‌చెరు, ఉప్పల్ వంటి ప్రాంతాల్లోనూ నీటి తరువాయి 2 వ పేజీలో...

'పరిషత్తూ..' కూటమిదే!

జగన్ కంచుకోటల్లో టీడీపీ పాగా

273 జెడ్పీటీసీలు, 5,596 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు

వైసీపీకి 20 జెడ్పీటీసీలు, 1,050 ఎంపీటీసీలు

ఉత్తరాంధ్ర నుంచి అనంతపురం వరకు పరిషత్తు ఎన్నికల్లో కూటమి ప్రభంజనం కొనసాగింది. వైసీపీకి గట్టి పోటీ ఇవ్వలేని పరిస్థితి ఎదురైంది. కూటమి పార్టీల్లో తెలుగుదేశం పార్టీ అత్యధిక స్థానాలు కైవసం చేసుకుని అగ్రస్థానంలో నిలిచింది. జనసేన, బీజేపీలు సైతం తమ ఉనికిని చాటుకున్నాయి. మున్సిపల్ ఎన్నికల తరహాలోనే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను కూటమి ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని భారీ విజయాలు సాధించింది. ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ సమీకరణాలు మారుతున్న సంకేతాలు కనిపించాయి.



విజయవాడ, నవంబర్ 7 (ఈవార్తలు): మున్సిపల్ ఎన్నికల్లో జగన్ కంచుకోటలుగా భావించిన ప్రాంతాల్లోనూ కూటమి బలమైన ఫలితాలు సాధించింది. ముఖ్యంగా కడప జిల్లాలో వైసీపీకి కీలకమైన స్థానాల్లో ఎదురుదెబ్బ తగిలింది. రాయలసీమలో వైసీపీకి కంచుకోటగా పేరున్న ప్రాంతాల్లోనూ కూటమి అభ్యర్థులు విజయం సాధించడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. బద్వేలు, పులివెందుల వంటి ప్రాంతాల్లోనూ కూటమి తన పట్టును నిరూపించుకుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి సాధించిన విజయాలు వైసీపీకి రాజకీయంగా సవాలుగా మారాయి. రాత్రి 9 గంటల సమయానికి అందిన ఎన్నికల ఫలితాల ప్రకారం.. జెడ్పీటీసీ స్థానాల్లో తెలుగుదేశం పార్టీ 158 స్థానాలు గెలుచుకుంది. ఎక్స్‌గేషియా స్థానాలతో కలిపి ఈ సంఖ్య 229కి చేరింది. జనసేన 34 స్థానాలు (ఎక్స్‌గేషియాతో కలిపి 36), బీజేపీ 5 స్థానాలు తరువాయి 2 వ పేజీలో...

ఆకాశమే హద్దు..!

13,629 అడుగుల ఎత్తులో ఐఏఎఫ్ ప్రపంచ రికార్డు



లడఖ్: లడఖ్‌లో భారత వాయుసేన అరుదైన ఘనత సాధించింది. అత్యంత ఎత్తైన ప్రాంతాల్లో భారీ విమానాలను నడిపే సామర్థ్యాన్ని చాటుతూ.. ఐఎల్-76ఎండీ రవాణా విమానాన్ని 13,629 అడుగుల ఎత్తులో విజయవంతంగా ల్యాండ్ చేసింది. తూర్పు లడఖ్‌లోని న్యోమా ఎయిర్‌ఫీల్డ్‌లో ఈ చారిత్రక ల్యాండింగ్ జరిగింది. ప్రపంచంలో ఈ తరహా విమానానికి ఇదే అత్యంత ఎత్తులో జరిగిన ల్యాండింగ్ అని భారత వాయుసేన ప్రకటించింది. ఈ ఘనతకు సంబంధించిన ఫొటోలు,



గంటకు 503 కి.మీ స్పీడ్

చైనా ఎలక్ట్రిక్ కార్ సంచలన రికార్డు

అబుదాబి: చైనా ఆటోమొబైల్ సంస్థ బీవైడీకి చెందిన యాంగ్‌వాంగ్ యూ9 ఎక్స్‌ట్రీమ్ ఎలక్ట్రిక్ హైపర్‌కారు గంటకు 503.17 కిలోమీటర్ల గరిష్ఠ వేగాన్ని అందుకుంది. అబుదాబిలో నిర్వహించిన పరీక్షలో ఈ ఘనత సాధించి, ఒకే దిశలో ప్రయాణించిన ఉత్పత్తి కార్ల విభాగంలో ప్రపంచ రికార్డు సృష్టించింది. గంటకు 500 కిలోమీటర్ల వేగాన్ని దాటిన తొలి ఉత్పత్తి కారుగా నిలిచింది. ఎలక్ట్రిక్ కార్ల సామర్థ్యంపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న అంచనాలను తరువాయి 2 వ పేజీలో...

ట్రంప్‌కు హనుమాన్ చాలీసా బహుమతి

వైట్‌హౌస్‌లో ఘనంగా దీపావళి వేడుకలు



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైట్‌హౌస్‌లోని తన అధికారిక కార్యాలయం ఓవల్ ఆఫీస్‌లో దీపావళి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. నిన్న జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖ భారతీయ-అమెరికన్ పారిశ్రామికవేత్తలు, సీఈఓలు, ఆయన ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా-2 వ పేజీలో...

ఆయుర్వేద ఆస్పత్రికి 'జబ్బు' చేసింది!

కొడిమ్యాలలో మూతపడిన ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల.. రోగులు వస్తున్నా అందుబాటులో లేని వైద్య సేవలు

వైద్యుడూ లేడు.. సిబ్బందీ రారు.. పట్టించుకోని అధికారులు

కొడిమ్యాల, నవంబర్ 7 (ఈవార్తలు) (ఈవార్తలు): ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన ప్రభుత్వ ఆసుపత్రులే నిర్లక్ష్యానికి నిలయాలుగా మారితే సామాన్య రోగుల పరిస్థితి ఏమిటి? వైద్యం కోసం ఆసుపత్రికి వస్తే తలుపులు మూసి దర్శనమిస్తే ఎవరిని ఆశ్రయించాలి? జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల పరిస్థితి ఇదే ప్రశ్నలను లేవనెత్తుతోంది. నిత్యం తెరిచి ఉండాల్సిన ఈ వైద్యశాల ఎప్పుడు చూసినా మూసివేసే ఉంటుండటంతో ప్రజలకు వైద్య సేవలు అందని ద్రాక్షగా మారాయి. ఆయుర్వేద వైద్యంపై నమ్మకంతో మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఎంతోమంది రోగులు ఈ ఆసుపత్రికి వస్తుంటారు. దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు సంప్రదాయ వైద్య విధానంలో చికిత్స పొందాలనే ఆశతో వ్యయప్రయాసలకోర్చి ఆసుపత్రికి చేరుకుంటారు. తీరా అక్కడికి వెళ్లాక తాళం వేసి ఉండటంతో నిరాశతో వెనుదిరగాల్సిన దుస్థితి నెలకొంది. వైద్యుడు అందుబాటులో లేకపోవడం ఒక సమస్య అయితే, ఆసుపత్రిలో పనిచేయాల్సిన సిబ్బంది సైతం విధులకు హాజరుకాకపోవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ప్రభుత్వ వైద్యశాల అంటే ప్రజలకు నమ్మకం, భరోసా కల్పించాలి. కానీ కొడిమ్యాల ఆయుర్వేద వైద్యశాల మాత్రం ప్రజలకు ఉపయోగపడని భవనంగా మిగిలిపోతోంది. వైద్యశాల నిర్వహణపై పర్యవేక్షణ చేయాల్సిన సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారు? వైద్యుడు, సిబ్బంది విధులకు హాజరవుతున్నారా లేదా అన్నది తనిఖీ చేయాల్సిన బాధ్యత లేదా? ప్రజాధనంతో నిర్వహిస్తున్న ప్రభుత్వ వైద్యశాల ప్రజలకు సేవలందించకపోతే దాని ఉనికి వల్ల ప్రయోజనం ఏమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అనారోగ్యంతో ఆసుపత్రికి వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలే ఆధారం. అలాంటి సేవలను నిర్లక్ష్యం చేయడం వారి ఆరోగ్య హక్కును విస్మరించడమే. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వైద్యుడు, సిబ్బంది విధులకు క్రమం తప్పకుండా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలి. వైద్యశాలను ప్రతిరోజూ తెరిచి ఉంచి, రోగులకు అందుబాటులో వైద్య సేవలు కల్పించాలని కొడిమ్యాల మండల ప్రజలు కోరుతున్నారు.





10న నారాయణగూడలో
సదర్ సంబరాలు

నారాయణగూడ, నవంబర్ 7 (ఈవార్తలు): నారాయణగూడలో ఈ నెల 10న నిర్వహించనున్న సదర్ సయ్యాట వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు, సీనియర్ నాయకుడు వి. హనుమంతరావును నిర్వాహకులు ఆహ్వానించారు. కాంగ్రెస్ బర్కత్‌పురా డివిజన్ అధ్యక్షుడు కైరంకొండ శ్రీనివాస్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు అస్లేష్, కిషోర్ యాదవ్‌లతో కూడిన ప్రతినిధి బృందం వి. హనుమంతరావు, లక్ష్మణ్ యాదవ్‌లను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సదర్ సయ్యాట వేడుకలను నారాయణగూడలోని దీపక్ టాకీస్ ప్రాంగణంలో వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, యాదవ సోదరులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పద్మారావు ముదలియార్‌కు ఘన నివాళి



బన్సీలాల్‌పేట్, నవంబర్ 7 (ఈవార్తలు): నిజాం కాలంలోనే బాలికల విద్యను ప్రోత్సహించేందుకు సికింద్రాబాద్‌లో కీస్ హైస్కూల్‌ను ఏర్పాటు చేసిన విద్యావేత్త, దివాన్ బహదూర్ పద్మారావు ముదలియార్ గొప్ప సంఘ సంస్కర్త అని పద్మారావు నగర్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎంబీఆర్ సంస్థ చైర్మన్ మామిడి బాల్‌రెడ్డి అన్నారు. దివాన్ బహదూర్ పద్మారావు ముదలియార్ 151వ జయంతి సందర్భంగా పద్మారావు నగర్ పార్కులోని ఆయన నూతన విగ్రహానికి బాల్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సికింద్రాబాద్‌లోని సుందరమైన కాలనీల్లో ఒకటైన పద్మారావు నగర్‌కు ఆయన పేరే పెట్టారని తెలిపారు. ప్రస్తుతం పార్కు ఉన్న ప్రాంతంలో రెండు ఎకరాల స్థలాన్ని ఆయన కేటాయించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తు తరాలకు పద్మారావు ముదలియార్ సేవలు, గొప్పదనం తెలియజేయాలనే ఉద్దేశంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విగ్రహాన్ని ఏర్పాటు చేసి జయంతి వేడుకలు నిర్వహించినట్లు బాల్‌రెడ్డి తెలిపారు. ప్రతిరోజూ వందలాది మంది యోగా, వ్యాయామం, నడక కోసం పార్కుకు వస్తుంటారని, వారి కోసం ఆహ్లాదకర వాతావరణం, పచ్చదనం ఉండేలా కృషి చేస్తున్నానని చెప్పారు.



కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర :దూలం బాలగౌడ్

గంగాధర, నవంబర్ 7 (ఈవార్తలు): ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు మద్దతు ధర పొందాలని గంగాధర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ దూలం బాలగౌడ్ అన్నారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు గంగాధర సింగిల్ విండో ఆధ్వర్యంలో నారాయణపూర్‌లో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలగౌడ్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. రైతులు ఇబ్బంది పడకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కేంద్రం నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మంత్రి మహేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుబ్బాసి బుచ్చన్న, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పురుమల్ల మనోహర్, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు చిరుత మంగ, మాజీ జడ్పీటీసీ సత్తు కనకయ్య, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ముద్దం నగేష్, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

తెలంగాణ సాధు పరిషత్ నూతన కార్యవర్గం ఏర్పాటు

అధ్యక్షుడిగా సోమయప్ప స్వామీజీ.. ప్రధాన కార్యదర్శిగా శివానంద స్వామీజీ

హైదరాబాద్, నవంబర్ 7 (ఈవార్తలు): తెలంగాణ సాధు పరిషత్ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. పరిషత్ అధ్యక్షుడిగా సోమయప్ప స్వామీజీ, ప్రధాన కార్యదర్శిగా శివానంద స్వామీజీ, కోశాధికారిగా మహాదేవ్ స్వామీజీని నియమించారు. ఉపాధ్యక్షులుగా రగోత్తమ స్వామీజీ, విరాధర్మజ స్వామీజీ, కైవల్యానంద స్వామి, కృష్ణానంద స్వామీజీ తదితరులను ఎంపిక చేశారు. విశ్వహిందూ పరిషత్ నాయకుడు రామరాజు, కేంద్ర మార్గదర్శక మండలి సభ్యుడు సంగ్రామ్ మహారాజ్, దుర్గానంద పూరి స్వామీజీ, ధర్మాచార్య ప్రముఖ్ పగడుకుల బాలస్వామి, హిందూ సంఘాల ప్రతినిధులు కరాటే కళ్యాణి, బాలకృష్ణ గురుస్వామి, రవీందర్, భూపాల్, శ్రీకాంత్ తదితరుల సమక్షంలో ఈ కార్యవర్గాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.





20 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం.. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శ

ధర్మపురి, నవంబర్ 7 (ఈవార్తలు): కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రాష్ట్రంలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. శుక్రవారం జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం దొంతాపూర్‌లో సాగునీరు అందక ఎండిపోతున్న వరి, పత్తి పంటలను పరిశీలించి రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.400 కోట్లతో ఆర్ఎఫ్ఎల్ నుంచి ముత్తూరు వరకు 14 ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేశామని తెలిపారు. దొంతాపూర్ ఎత్తిపోతల పథకంలోని మోటార్లు గత ఆరు నెలలుగా మరమ్మతులకు గురైనా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గోదావరి పక్కనే ఉన్నప్పటికీ పంటలకు నీరందక ఎండిపోవడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని, 365 కరువు మండలాలుగా ప్రకటించినప్పటికీ రైతులకు ఆర్థిక సాయం అందడం లేదని విమర్శించారు. రైతుబంధు, రైతుబీమా అమలులోనూ నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. ఎండిపోయిన పంటలకు ప్రభుత్వం వెంటనే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, అయ్యోరి రాజేష్, సంగి శేఖర్, బీఆర్ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

అమృతకు బండి ఆపన్న హస్తం

తక్షణ సాయంగా రూ.50 వేలు పంపిణీ.. డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి

వేములవాడ అర్బన్, నవంబర్ 7 (ఈవార్తలు): సొంత ఇల్లు లేక శ్మశానంలో నివసిస్తూ అనారోగ్యంతో బాధపడుతున్న కుమారుడితో దుర్భర జీవితం గడుపుతున్న చందుర్తి మండలం కిష్టంపేటకు చెందిన మర్రిపల్లి అమృతకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అండగా నిలిచారు. ఆమెకు తక్షణ సాయంగా రూ.50 వేలు పంపించారు. ఈ నగదును బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి ద్వారా అమృతకు అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్‌తో కేంద్ర మంత్రి ఫోన్‌లో మాట్లాడి అమృత పరిస్థితిని వివరించారు. ఆమెకు వెంటనే డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ ఇల్లు మంజూరు చేస్తామని తెలిపినట్లు సమాచారం. అనారోగ్యంతో ఉన్న కుమారుడితో కలిసి శ్మశానంలో నివసిస్తున్న అమృత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉండాలని బండి సంజయ్ పార్టీ శ్రేణులను ఆదేశించారు. డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరైన వెంటనే ఇంటికి అవసరమైన సామగ్రితో పాటు కుటుంబానికి సరిపడా నిత్యావసర సరుకులు అందించాలని సూచించారు.



బాణసంచా గోదాంపై పోలీసుల ఆకస్మిక దాడి

మైనర్లు పనిచేస్తున్నట్లు గుర్తింపు.. యజమానిపై కేసు నమోదు

జగిత్యాల, నవంబర్ 7 (ఈవార్తలు): దీపావళి పండుగ నేపథ్యంలో బాణసంచా గోదాంలలో భద్రతా ప్రమాణాల అమలుపై పోలీసులు తనిఖీలు నిర్వహించారు. డీఎస్పీ పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో పట్టణ, గ్రామీణ పోలీసులు గొల్లపల్లి రోడ్డులోని భరత్ ఫైర్ క్రాకర్స్ గోదాంలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ముగ్గురు మైనర్లు పనిచేస్తున్నట్లు గుర్తించారు. నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి గోదాం యజమానిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. బాణసంచా నిల్వలు, విక్రయాల సమయంలో భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తనిఖీల్లో పట్టణ సీఐ కరుణాకర్, గ్రామీణ ఎస్సై ఉమాసాగర్, ట్రాఫిక్ ఎస్సై మల్లేశ్, అగ్నిమాపక కేంద్రం అధికారి కృష్ణకాంత్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



కొండగట్టు చందనోత్సవ ఏర్పాట్ల పరిశీలన

మల్యాల, నవంబర్ 7 (ఈవార్తలు): కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో నిర్వహించనున్న చందనోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో జరుగుతున్న ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. దేవస్థానం ఈఓ అంజనా రెడ్డి, ఇంజినీరింగ్ విభాగం ఈఈ రాజేష్ ఆలయంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ముఖ్యంగా ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో చేపడుతున్న పనులు, భక్తులకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనపై దృష్టి సారించారు.



పెట్రోల్ బంకుకు ప్రభుత్వ భూమి లీజుపై ఫిర్యాదు

డిసెంబర్ 3లోగా నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌కు లోకాయుక్త ఆదేశం

మాజీ మంత్రి జీవన్‌రెడ్డి ఫిర్యాదుతో విచారణ



జగిత్యాల, నవంబర్ 7 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని సర్వే నంబరు 105లో ఉన్న ప్రభుత్వ భూమిని పెట్రోల్ బంకు కోసం లీజుకు ఇవ్వడంపై మాజీ మంత్రి టి. జీవన్‌రెడ్డి తెలంగాణ లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. 621 చదరపు గజాల ప్రభుత్వ భూమి నిషేధిత జాబితాలో ఉన్నప్పటికీ లీజుకు ఇవ్వడం నిబంధనలకు విరుద్ధమని ఫిర్యాదులో పేర్కొన్నారు. నెలకు రూ.72 వేల అద్దె నిర్ణయించడం మార్కెట్ విలువకు అనుగుణంగా లేదని, సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులను ఉల్లంఘించినట్లు ఉందని ఆరోపించారు. 1906లో నిజాం ప్రభుత్వం నిర్మించిన చారిత్రక తహసీల్ కార్యాలయాన్ని పురావస్తు శాఖ అనుమతులు లేకుండా కూల్చివేశారని, టెండర్లు నిర్వహించకుండానే ఆయిల్ కంపెనీకి స్థలం కేటాయించారని ఫిర్యాదులో వివరించారు. ఈ విషయంపై కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినా స్పందన లేదని తెలిపారు. ఫిర్యాదును పరిశీలించిన లోకాయుక్త జగిత్యాల జిల్లా కలెక్టర్ (పీఎస్-3) బాధ్యతగల అధికారి ద్వారా డిసెంబర్ 3లోగా నివేదిక సమర్పించాలని ఆదేశించింది. తదుపరి విచారణను అదే తేదీకి వాయిదా వేసింది.

లారీ ఢీకొని మహిళ మృతి

ఎండపల్లి, నవంబర్ 7 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం మారేడుపల్లి గ్రామంలోని ఐకేపీ కేంద్రం సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. ద్విచక్రవాహనంపై వెళ్తున్న భార్యాభర్తలను లారీ ఢీకొట్టడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. గోదావరిఖని నుంచి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆవుల ప్రణీతను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. ఆమె భర్త ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



వెలమ కార్పొరేషన్ చైర్మన్‌గా నర్సింగరావు

కోరుట్ల, నవంబర్ 7 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ తొలి చైర్మన్‌గా జువ్వాడి నర్సింగరావు శనివారం హైదరాబాద్‌లోని మైత్రీవనంలో మంత్రుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా హకీంపేటలోని కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కోరుట్ల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ముక్కెర చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి ఆకుల మల్లికార్జున్‌తో పాటు పలువురు పాత్రికేయులు నర్సింగరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రెస్‌క్లబ్ తరఫున శాలువా కప్పి సత్కరించి, చిత్రపటాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. నర్సింగరావు పదవీకాలంలో కార్పొరేషన్ అభివృద్ధి చెందడంతో పాటు అర్హులైన వారికి సంక్షేమ పథకాల ఫలాలు అందాలని పాత్రికేయులు ఆకాంక్షించారు.

తపాలా కార్యాలయ స్థలంపై విచారణకు వినతి

శేరిలింగంపల్లి, నవంబర్ 7 (ఈవార్తలు): స్థానిక తపాలా కార్యాలయానికి సంబంధించిన స్థలం ప్రభుత్వానిదా, ప్రైవేటు వ్యక్తులదా అనే విషయంపై స్పష్టత ఇవ్వాలని కోరుతూ స్థానికులు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. రెవెన్యూ రికార్డులు, లేఅవుట్, ఇతర ఆధారాలను పరిశీలించి స్థల యాజమాన్యాన్ని అధికారికంగా నిర్ధారించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపై స్పందించిన తహసీల్దార్ సంబంధిత రికార్డులను పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రయత్నం ఎవరికీ వ్యతిరేకం కాదని, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణతో పాటు వాస్తవాలను నిర్ధారించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్ అధ్యక్షుడు బజార్హట్ రమేష్, జై హనుమాన్ యూత్ అధ్యక్షుడు కావలి రాజకుమార్ ముదిరాజ్, సుధాకర్ రెడ్డి, తిరుమల చారి, సత్యం, మహేష్ గౌడ్, ఏజాజ్ ఖాన్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



చీకటిపై వెలుగుల విజయం

దేశ ప్రజలకు రాష్ట్రపతి, ప్రధాని దీపావళి శుభాకాంక్షలు





న్యూఢిల్లీ: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ విలువలను అనుసరిస్తూ వికసిత్ భారత్ నిర్మాణంలో యువత ఉత్సాహంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని, సమాజంలో సౌభ్రాతృత్వంతో మెలగాలని సూచించారు. దేశంలో, విదేశాల్లో నివసిస్తున్న భారతీయులందరికీ హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. దీపావళి పండుగకు సాంస్కృతికంగా, ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాధాన్యం ఉందని రాష్ట్రపతి పేర్కొన్నారు. రావణుడిపై విజయం సాధించిన అనంతరం శ్రీరాముడు అయోధ్యకు తిరిగి వచ్చిన సందర్భంలో ప్రజలు దీపాలు వెలిగించి స్వాగతం పలికారని గుర్తుచేశారు. ఈ వేడుక రామరాజ్య శుభారంభానికి ప్రతీకగా నిలిచిందన్నారు. చెడు లక్షణాలపై సద్గుణాల విజయం, కష్టాల నుంచి విముక్తి పొంది సుఖసంతోషాలతో కూడిన జీవితం ప్రారంభం కావడాన్ని దీపావళి సూచిస్తుందని తెలిపారు. శుభారంభాల కోసం గణేశుడిని, సంపద, శ్రేయస్సు కోసం మహాలక్ష్మిని పూజిస్తూ అందరి సంతోషం కోసం ప్రార్థిస్తారని వివరించారు. దేశ ప్రజలందరికీ ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం కలగాలని ఆకాంక్షించారు. మరోవైపు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా దీపావళి సందర్భంగా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ చీకటిపై వెలుగుల విజయానికి, చీకటిని పారదోలాలన్న సంకల్పానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆరోగ్యం, శ్రేయస్సు నిండాలని ఆకాంక్షించారు. ఏటా ఉత్సాహంగా దీపావళి జరుపుకుంటానని, ఈసారి కూడా సరిహద్దుల్లో దేశాన్ని కాపాడుతున్న వీర జవాన్లతో కలిసి పండుగ చేసుకోనున్నట్లు వెల్లడించారు. అంతకుముందు ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్‌ను మోదీ కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. మరోవైపు ఉపరాష్ట్రపతి అయోధ్యలో నిర్వహించే దీపోత్సవం-2026లో పాల్గొనేందుకు శనివారం అక్కడికి చేరుకున్నారు. శ్రీరామ జన్మభూమి ఆలయంలో పూజలు చేయడంతో పాటు శ్రీరాముడి పట్టాభిషేక కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ ఏడాది దీపోత్సవం పదో వార్షికోత్సవం కావడం విశేషం. అయోధ్యలోని 56 ఘాట్లలో 30 నుంచి 33 లక్షల మట్టి దీపాలు వెలిగించాలని నిర్వాహకులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

దీపావళి వేళ 5 లక్షల కోట్ల వ్యాపారం!



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా దీపావళి పండుగ సీజన్ వ్యాపార వర్గాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. ఈ సీజన్‌లో సుమారు రూ.5 లక్షల కోట్ల భారీ వ్యాపారం జరుగుతుందని ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) అంచనా వేసింది. దేశ రాజధాని ఢిల్లీలోనే దాదాపు రూ.80,000 కోట్ల వాణిజ్యం నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది. సీటీఐ చైర్మన్ బ్రిజేష్ గోయల్ మాట్లాడుతూ.. ఈ పండుగ సీజన్ దేశవ్యాప్తంగా వ్యాపారులకు గొప్ప అవకాశాలను తెచ్చిపెట్టిందని అన్నారు. ముఖ్యంగా వినియోగదారుల నుంచి స్వదేశీ ఉత్పత్తులకు బలమైన డిమాండ్ కనిపిస్తోందని తెలిపారు. గత నెలలో ర్యాలీలు, నిరసనల కారణంగా వ్యాపార నష్టాలను ఎదుర్కొన్న ఢిల్లీ వ్యాపారులు, ఈ దీపావళి అమ్మకాలతో ఆ నష్టాలను పూడ్చుకుని లాభాల బాట పడతామని ఆశిస్తున్నారని ఆయన వివరించారు. దేశవ్యాప్తంగా ఆర్థిక కార్యకలాపాలు సానుకూలంగా ఉన్నాయని చెప్పడానికి ఆటోమొబైల్ అమ్మకాలే నిదర్శనమని గోయల్ పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన నివేదిక ప్రకారం.. రిటైల్ ఆటోమొబైల్ అమ్మకాలు 55 శాతం పెరిగాయని ఆయన తెలిపారు. ముఖ్యంగా ప్యాసింజర్ వాహనాలు 70 శాతం, ద్విచక్ర వాహనాలు 52 శాతం, త్రీ-వీలర్లు 110 శాతం వృద్ధిని నమోదు చేశాయని, ఇది బలమైన వినియోగదారుల డిమాండ్‌కు సంకేతమని అన్నారు. ఈ ఏడాది పండుగ సీజన్‌లో స్వదేశీ వస్తువులకే ప్రజలు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని గోయల్ తెలిపారు. మట్టి ప్రమిదలు, దేవుళ్ల విగ్రహాలు, హస్తకళా ఉత్పత్తులు, గోద అలంకరణ వస్తువులు, శుభ్-లాభ్, ఓం వంటి సాంప్రదాయ చిహ్నాలకు మంచి డిమాండ్ కనిపిస్తోందన్నారు. స్థానిక కళాకారులు, చేతివృత్తి నిపుణులు తయారుచేసిన వస్తువుల అమ్మకాలు గణనీయంగా పెరిగాయని చెప్పారు. జీఎస్టీ సంస్కరణలు కూడా భారతీయ ఉత్పత్తులకు మరింత గుర్తింపునిచ్చి, స్థానికంగా తయారైన వస్తువులకు డిమాండ్‌ను బలోపేతం చేశాయని సీటీఐ తన ప్రకటనలో పేర్కొంది. వీటితో పాటు ఎఫ్ఎంసీజీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఎలక్ట్రానిక్స్, వస్త్రాలు, ఫ్యాషన్ అపెరల్, మొబైల్ ఫోన్లు, గృహోపకరణాలు, ఫర్నిచర్ వంటి రంగాల్లో కూడా భారీ వ్యాపారం జరుగుతుందని అంచనా. ఈ పండుగ సమయంలో దేశవ్యాప్తంగా సుమారు 5 కోట్ల బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారని, ఇది కూడా అమ్మకాలను పెంచుతోందని తెలిపారు. ఢిల్లీలోని చాందినీ చౌక్, సదర్ బజార్, కమలా నగర్, రాజౌరీ గార్డెన్, లజపత్ నగర్ వంటి ప్రధాన మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. మొబైల్ ఫోన్లు, గిఫ్టులు, డ్రై ఫ్రూట్స్, దుస్తులు, ఎలక్ట్రానిక్ వస్తువుల కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయని, ఇది రాజధానిలో పుంజుకున్న వ్యాపార కార్యకలాపాలకు సూచిక అని గోయల్ పేర్కొన్నారు.

ఇరాన్ అణు రహస్యాలు చెబితే రూ.166 కోట్లు: అమెరికా

ఇరాన్ అణు కార్యక్రమంపై కీలక సమాచారం అందించిన వారికి 20 మిలియన్ డాలర్ల (దాదాపు రూ. 166 కోట్లు) వరకు భారీ రివార్డును అమెరికా ప్రకటించింది. శుక్రవారం యూఎస్ సెంట్రల్ కమాండ్ ఈ సంచలన ప్రకటన విడుదల చేసింది. సమాచారం అందించిన వారికి అవసరమైతే పునరావాసం కూడా కల్పిస్తామని స్పష్టం చేసింది. అమెరికా విదేశాంగ శాఖకు చెందిన 'రివార్డ్స్ ఫర్ జస్టిస్' కార్యక్రమం కింద ఈ ఆఫర్‌ను ప్రకటించారు. ఇరాన్ అణు కేంద్రాలు, వాటిలో ఉపయోగించే పరికరాలు, ఈ కార్యక్రమంలో పాలుపంచుకుంటున్న శాస్త్రవేత్తలు, ఇతర సిబ్బంది వివరాలు అందించాలని కోరారు. సిగ్నల్ లేదా టోర్ ఆధారిత చానెల్ ద్వారా ఈ సమాచారాన్ని రహస్యంగా పంపవచ్చని సూచించారు. అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ) నిబంధనలను ఇరాన్ ఉల్లంఘిస్తోందని, దీనివల్ల సెంట్రిఫ్యూజ్‌ల వంటి కీలక పరికరాల ఉత్పత్తి, నిల్వలపై పర్యవేక్షణ లేకుండా పోయిందని అమెరికా విదేశాంగ శాఖ ఆరోపించింది. మరోవైపు, ఈ ప్రకటనకు ముందు ఫ్లోరిడాలోని వెస్ట్ పామ్ బీచ్‌లో మాట్లాడిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "మనం ఇరాన్‌పై దాడి చేయకపోయి ఉంటే, ఈ రోజు ఇజ్రాయెల్ ఉండేది కాదు. వారికి అణ్వాయుధాలు చిక్కి ఉంటే తప్పకుండా వాడేవారు" అని ఆయన అన్నారు. గత ఎనిమిది నెలల ఘర్షణతో ఇరాన్ ఆర్థికంగా, సైనికంగా తీవ్రంగా దెబ్బతిన్నదని, ఇప్పుడు ఒప్పందం కోసం ఆరాటపడుతోందని ట్రంప్ పేర్కొన్నారు. మధ్య ఇరాన్‌లోని 'పికాక్స్ మౌంటెన్' వంటి ఒకటి రెండు ప్రాంతాలపై ఇంకా దృష్టి సారించాల్సి ఉందని ఆయన తెలిపారు. అయితే, ట్రంప్ ఆరోపణలను ఇరాన్ అధికారులు ఖండించారు. 'పికాక్స్ మౌంటెన్'కు అణు కార్యకలాపాలతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ సంక్షోభాన్ని చర్చల ద్వారా పరిష్కరించుకోవడానికి టెహ్రాన్ సిద్ధంగా ఉందని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజేష్కియాన్ ఇటీవలే స్పష్టం చేయడం గమనార్హం.

భగవంత్ మాన్‌కు వీసా: పాకిస్థాన్

ఇస్లామాబాద్: పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌కు వీసా జారీ చేసే అంశాన్ని పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని పాకిస్థాన్ ప్రకటించింది. లాహోర్‌లో ఈ నెల జరగనున్న ప్రపంచ పంజాబీ సదస్సులో పాల్గొనాలని తనకు ఆహ్వానం అందినట్లు మాన్ ఇటీవల వెల్లడించిన నేపథ్యంలో పాక్ ఈ ప్రకటన చేసింది. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది. పాకిస్థాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి సజ్జద్ హైదర్ ఖాన్ మీడియా సమావేశంలో ఈ విషయం తెలిపారు. "భగవంత్ మాన్ పాకిస్థాన్‌ను సందర్శించాలని కోరుకుంటే, ఆయనకు వీసా జారీ చేసే విషయాన్ని మేం పరిగణనలోకి తీసుకుంటాం" అని ఆయన పేర్కొన్నారు. అయితే, సరిహద్దు దాటి వచ్చేందుకు భారత ప్రభుత్వం ఆమ్ ఆద్మీ పార్టీ నేత అయిన మాన్‌కు అనుమతి ఇస్తుందా లేదా అనేది వేరే విషయమని ఆయన స్పష్టం చేశారు. నవంబర్ 27న లాహోర్‌లో జరగనున్న సదస్సుకు తనకు ఆహ్వానం అందిందని, అయితే పాకిస్థాన్ వెళ్లేందుకు అనుమతి లభిస్తుందో లేదోనని అక్టోబర్ 23న మాన్ సందేహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

కొడంగల్ టెండర్లలో పొంగులేటి కంపెనీకి లబ్ధి: కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 7 (ఈవార్తలు): తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. కొడంగల్-నారాయణపేట-మక్తల్ ఎత్తిపోతల పథకం టెండర్లలో భారీ అవకతవకలు జరిగాయని, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన కంపెనీకి అనుచిత లబ్ధి చేకూర్చారని ఆరోపించారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం 2014లో సుమారు రూ.1,450 కోట్లుగా ఉండగా, దానిని ఇప్పుడు రూ.6,825 కోట్లకు పెంచారని కేటీఆర్ విమర్శించారు. రైతులకు ఇంకా చుక్క నీరు అందకముందే, అంచనా వ్యయాన్ని దాదాపు ఐదు రెట్లు పెంచి రాష్ట్ర సంపదను దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. టెండర్ల ప్రక్రియలో మంత్రి పొంగులేటి కంపెనీ ప్రధాన పోటీదారుగా ఉందని, మిగతా కంపెనీలన్నీ నామమాత్రపు పోటీదారులేనని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంపై కేటీఆర్ తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

ఈ20 కాదు 420

ఇంధన సంస్థలు ప్రజలను మోసం చేస్తున్నాయి: రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ: దేశంలోని ప్రధాన చమురు మార్కెటింగ్ కంపెనీలు పెట్రోల్‌లో ప్రభుత్వం నిర్దేశించిన 20 శాతం పరిమితికి మించి ఇథనాల్ కలుపుతూ ప్రజలను మోసం చేస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. కర్ణాటక ప్రభుత్వం నిర్వహించిన ల్యాబొరేటరీ పరీక్షల ఫలితాలను ఉటంకిస్తూ ఆయన శనివారం ఈ వ్యాఖ్యలు చేశారు. "ఈ20 కాస్తా 420గా మారింది - ప్రజల కార్ల నుంచి పెట్రోల్ దొంగిలిస్తున్నారు!" అంటూ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా తీవ్రస్థాయిలో విమర్శించారు. చమురు సంస్థల టెస్టింగ్ ప్రక్రియలో పారదర్శకత లోపించిందని ఆయన ప్రశ్నించారు. కర్ణాటక ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి రిజ్వాన్ అర్షద్ విడుదల చేసిన వివరాల ప్రకారం, రాష్ట్రంలోని ఏడు జిల్లాల నుంచి సేకరించిన 14 పెట్రోల్ శాంపిల్స్‌ను ప్రభుత్వ గుర్తింపు పొందిన ల్యాబ్‌లో పరీక్షించగా, 11 శాంపిల్స్‌లో ఇథనాల్ శాతం 20కి మించి ఉన్నట్లు తేలింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) శాంపిల్‌లో 31.2 శాతం, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) శాంపిల్‌లో 30.5 శాతం ఇథనాల్ ఉన్నట్లు నివేదికలు వెల్లడించాయి. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్), నయారా ఎనర్జీ, షెల్ వంటి సంస్థల నుంచి సేకరించిన ఇతర శాంపిల్స్‌లో ఇథనాల్ శాతం 25.5 నుంచి 26.5 మధ్య ఉన్నట్లు తేలింది. బెంగళూరు, కోలార్, చిక్కబళ్లాపుర, బెంగళూరు గ్రామీణ, రామనగర, మంగళూరు, తుమకూరు జిల్లాల్లో ఈ శాంపిల్స్‌ను సేకరించారు. అధిక మోతాదులో ఇథనాల్ కలపడం వల్ల వాహనదారుల మైలేజీ తగ్గడమే కాకుండా ఇంజిన్‌లు దెబ్బతినే ప్రమాదం ఉందని మంత్రి రిజ్వాన్ అర్షద్ ఆందోళన వ్యక్తం చేశారు. మొదట ఈ శాంపిల్స్‌ను ఆయిల్ కంపెనీల ల్యాబ్‌లకు పంపగా, వారు ఇథనాల్ శాతం వివరాలు వెల్లడించలేదని, అందుకే స్వతంత్ర ల్యాబ్‌లో పరీక్షలు చేయించాల్సి వచ్చిందని ఆయన వివరించారు.

ఆరోపణలను ఖండించిన చమురు సంస్థలు

అయితే, కర్ణాటక ప్రభుత్వం, రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను ఐఓసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ సహా అన్ని చమురు మార్కెటింగ్ కంపెనీలు తీవ్రంగా ఖండించాయి. శాంపిల్స్ సేకరణ, పరీక్షా విధానాలు నిర్దేశిత చట్టబద్ధమైన మార్గదర్శకాల ప్రకారం జరగలేదని ఆక్షేపించాయి. తాము దేశవ్యాప్తంగా 27 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 893 శాంపిల్స్‌తో జాయింట్ క్వాలిటీ మానిటరింగ్ నిర్వహించామని, అందులో కర్ణాటకకు చెందిన 56 శాంపిల్స్ కూడా ఉన్నాయని తెలిపాయి. ఈ పరీక్షల్లో ఇథనాల్ శాతం 19 నుంచి 21 శాతం మధ్యలోనే ఉందని, కర్ణాటక శాంపిల్స్‌లో సగటున 19.3 శాతంగానే నమోదైందని స్పష్టం చేశాయి. ఈ తాజా వివాదంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమం, దాని ప్రభావంపై మరోసారి దేశవ్యాప్తంగా చర్చ మొదలైంది. వాహనాల పనితీరు, వినియోగదారులపై పడుతున్న భారంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

గర్భవతిని చంపి.. గోదావరిలో పడేసి..

భార్యపై కానిస్టేబుల్ కిరాతకం

కొత్తగూడెం, నవంబర్ 7 (ఈవార్తలు): భార్యను హత్య చేసిన ఓ ఆర్మ్‌డ్ రిజర్వ్ (ఏఆర్) కానిస్టేబుల్.. మృతదేహాన్ని మూటలో కట్టి ద్విచక్రవాహనంపై తీసుకెళ్లి గోదావరిలో పడేశాడు. ఈ ఘటనలో అతడికి తండ్రి కూడా సహకరించాడు. పోలీసుల విచారణలో నిందితుడు నేరాన్ని అంగీకరించడంతో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. నదిలో గాలింపు చేపట్టిన పోలీసులు మృతదేహాన్ని వెలికితీశారు. నిందితుడి తండ్రిని ఇంకా అరెస్టు చేయాల్సి ఉంది. కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ బి. రోహిత్‌రాజు వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెం పట్టణంలోని గొల్లగూడెంలో అద్దె ఇంట్లో నివసిస్తున్న బోడా నరేందర్ (ఏఆర్‌పీసీ-623) నవంబర్ 3 రాత్రి భార్య భవానీ (29)ని గొంతు నులిమి హత్య చేశాడు. చేతులతోపాటు స్కార్ఫ్ ఉపయోగించి ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. అనంతరం మృతదేహాన్ని గోళియా తండాలోని తన స్వగ్రామానికి తీసుకెళ్లాడు. తండ్రి బోడా హరిలాల్ సాయంతో వ్యవసాయ పొలంలో దాచిపెట్టాడు. నవంబర్ 4 రాత్రి 11 గంటల సమయంలో ఇద్దరూ కలిసి మృతదేహాన్ని ద్విచక్రవాహనంపై భద్రాచలానికి తీసుకెళ్లారు. జాతీయ రహదారి-30 మీదుగా సుమారు 60 కిలోమీటర్లు ప్రయాణించి గోదావరి వంతెన వద్దకు చేరుకున్నారు. అక్కడ మృతదేహాన్ని నదిలో పడేసి ఆధారాలు మాయం చేసేందుకు ప్రయత్నించారు. భవానీ కనిపించడం లేదంటూ ఆమె సోదరి గుండారపు స్వరూప నవంబర్ 6న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదైంది. అదే రోజు నరేందర్ పోలీసులను సంప్రదించి భార్యను హత్య చేసినట్లు అంగీకరించాడు. దీంతో పోలీసులు గోదావరిలో గాలింపు చేపట్టి శుక్రవారం రాత్రి భవానీ మృతదేహాన్ని గుర్తించారు. దాన్ని భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించి శనివారం పోస్టుమార్టం నిర్వహించారు. నరేందర్‌ను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించనున్నట్లు ఎస్పీ తెలిపారు. అతడి తండ్రి హరిలాల్ కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. భవానీ, నరేందర్‌కు మూడేళ్ల క్రితం ఫేస్‌బుక్ ద్వారా పరిచయం ఏర్పడింది. కొంతకాలం సహజీవనం చేసిన వీరు 2025 ఏప్రిల్‌లో భద్రాద్రి ఆలయంలో వివాహం చేసుకున్నారు. అయితే భవానీని పెళ్లి చేసుకోవడాన్ని నరేందర్ కుటుంబ సభ్యులు వ్యతిరేకించడంతో దంపతుల మధ్య తరచూ గొడవలు జరిగేవని సమాచారం.

101 ఫ్లాట్ల కొనుగోలుదారులకు రిజిస్ట్రేషన్

17 ఏళ్ల నిరీక్షణకు తెర.. సుప్రీం కీలక ఆదేశాలు



న్యూఢిల్లీ: కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు ఫేజ్-15లో ఇళ్ల కోసం గత 17 ఏళ్లుగా నిరీక్షిస్తున్న కొనుగోలుదారులకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. వివాదంలో ఉన్న 101 ఫ్లాట్లను ఈ నెల 23వ తేదీలోగా కొనుగోలుదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని తెలంగాణ హౌసింగ్ బోర్డును సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ కేవీ విశ్వనాథన్, జస్టిస్ అరుణ్ పల్లిలతో కూడిన ధర్మాసనం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. వాయిదాల చెల్లింపుల్లో జాప్యం జరిగిన వారి నుంచి 14 శాతం వడ్డీ వసూలు చేయాలా? వద్దా? అనే అంశాన్ని హైకోర్టు తేల్చే వరకు వేచి చూడాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే, వడ్డీ వివాదం తేలే వరకు కొనుగోలుదారులను ఇబ్బంది పెట్టకూడదని పేర్కొంటూ, తక్షణమే రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించింది. హైకోర్టులో కేసు పరిష్కారమయ్యే వరకు ఈ ఇళ్లను ఇతరులకు విక్రయించడం లేదా బదిలీ చేయడం వంటి చర్యలు చేపట్టరాదని అటు హౌసింగ్ బోర్డుకు, ఇటు కొనుగోలుదారులకు న్యాయస్థానం ఆంక్షలు విధించింది. 2009లో హౌసింగ్ బోర్డు 'సంపూర్ణం' పథకం కింద కేపీహెచ్‌బీలో ఇళ్లను కేటాయించింది. తొలుత ఫ్లాట్ ధరను రూ.30.80 లక్షలుగా నిర్ణయించి, ఆ తర్వాత దానిని రూ.47.85 లక్షలకు పెంచడంతో వివాదం మొదలైంది. నిర్మాణంలో జాప్యం, అదనపు ధరల వసూలుపై కొనుగోలుదారులు వినియోగదారుల ఫోరం నుంచి జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ (ఎన్‌సీడీఆర్‌సీ) వరకు న్యాయపోరాటం చేశారు. బోర్డు వైపు నుంచే జాప్యం జరిగిందని నిర్ధారించిన ఎన్‌సీడీఆర్‌సీ, కొనుగోలుదారుల నుంచి 14 శాతం వడ్డీ వసూలు చేయడం సమర్థనీయం కాదని గతంలో తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాలు చేస్తూ హౌసింగ్ బోర్డు తొలుత హైకోర్టును, ఆ తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా.. తమ వైపు నుంచి జరిగిన ఆలస్యానికి 6 శాతం వడ్డీ చెల్లిస్తామని, అయితే కొనుగోలుదారుల నుంచి మాత్రం 14 శాతం వడ్డీ వసూలుకు అనుమతించాలని బోర్డు కోరింది. బోర్డు వాదనను తోసిపుచ్చిన ధర్మాసనం, బాధితుల 17 ఏళ్ల నిరీక్షణకు ముగింపు పలుకుతూ రిజిస్ట్రేషన్ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చింది.

భూమి రక్షణ కవచానికి భారీ బీటలు

టోక్యో: భూమి చుట్టూ ఉన్న అత్యంత బలమైన సహజ రేడియేషన్ కవచాలలో ఒకటైన వాన్ అలెన్ బెల్ట్‌కు భారీ సౌర తుపాన్ల వల్ల బీటలు పడతాయని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఈ ఆవిష్కరణ గ్రహం చుట్టూ ఉన్న అంతరిక్షాన్ని శక్తిమంతమైన కణాల నుండి భూమి అయస్కాంత క్షేత్రం ఎలా కాపాడుతుందనే దానిపై ఇప్పటివరకు ఉన్న అవగాహనను పూర్తిగా మార్చివేసింది. భూమి చుట్టూ ఉన్న ఈ రక్షణ వలయం అనుకున్నంత పటిష్ఠంగా లేదని తాజా పరిశోధన స్పష్టం చేసింది. ఈ వివరాలు 'జియోఫిజికల్ రీసెర్చ్ లెటర్స్' అనే జర్నల్‌లో అక్టోబర్ 26న ప్రచురితమయ్యాయి. భూమి చుట్టూ రెండు డోనట్ ఆకారపు ప్రాంతాలలో వాన్ అలెన్ రేడియేషన్ బెల్టులు విస్తరించి ఉన్నాయి. భూమి అయస్కాంత క్షేత్రం ద్వారా బంధించబడిన ఎలక్ట్రికల్ చార్జ్ ఉన్న కణాలు ఇందులో ఉంటాయి. లోపలి బెల్ట్‌లో అధిక సంఖ్యలో శక్తిమంతమైన ప్రోటాన్లు ఉండగా, బయటి బెల్ట్‌లో సౌర కార్యకలాపాల ద్వారా ప్రభావితమయ్యే ఎలక్ట్రాన్లు ఎక్కువగా ఉంటాయి. ఈ బెల్టులు భూమిని కొన్ని రకాల రేడియేషన్ల నుంచి కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయి. దశాబ్దానికి పైగా, ఈ లోపలి బెల్ట్ ఒక అభేద్యమైన కవచంలా పనిచేస్తుందని, 'కిల్లర్ ఎలక్ట్రాన్లు' అని పిలిచే అత్యంత శక్తివంతమైన కణాలను భూమికి దగ్గరగా రాకుండా అడ్డుకుంటుందని శాస్త్రవేత్తలు భావించారు. అయితే, 2024 మే నెలలో సంభవించిన అత్యంత శక్తిమంతమైన సౌర తుపాను ఈ నమ్మకాన్ని తలకిందులు చేసింది. ఈ తుపాను సమయంలో, అత్యంత శక్తిమంతమైన ఎలక్ట్రాన్లు రక్షిత ప్రాంతంగా భావిస్తున్న లోపలి బెల్ట్‌లో ప్రవేశించినట్లు పరిశోధకులు గుర్తించారు. జపాన్‌కు చెందిన 'అరసే' శాటిలైట్ ఈ కీలకమైన డేటాను రికార్డ్ చేసింది. ఈ శాటిలైట్ 2017 నుంచి భూమి రేడియేషన్ బెల్టులను నిరంతరం పర్యవేక్షిస్తోంది. 2024 మేలో సంభవించిన సౌర తుపానును అత్యధిక కేటగిరీ అయిన +5 జియోమాగ్నెటిక్ తుపానుగా వర్గీకరించారు. సూర్యుడి నుంచి వెలువడిన శక్తిమంతమైన సౌర మంటలు, కరోనల్ మాస్ ఎజెక్షన్‌ల ఫలితంగా భారీ మొత్తంలో చార్జ్ పార్టికల్స్ భూమి వైపు దూసుకొచ్చాయి. ఈ తుపాను భూమి చుట్టూ ఉన్న ప్లాస్మాస్పియర్ అనే ప్రాంతంలో చల్లని ప్లాస్మా పరిమాణాన్ని గణనీయంగా తగ్గించింది. దీనివల్ల 'కోరస్ వేవ్స్'గా పిలిచే విద్యుదయస్కాంత తరంగాలు ఏర్పడి, ఎలక్ట్రాన్‌లను అత్యధిక శక్తులకు వేగవంతం చేశాయి. తుపానుకు ముందు ఉన్న స్థాయిలతో పోలిస్తే, దాదాపు మూడు మెగాఎలక్ట్రాన్‌వోల్ట్‌ల శక్తి ఉన్న ఎలక్ట్రాన్‌ల సంఖ్య 5,000 రెట్లు పెరిగినట్లు పరిశోధకులు గుర్తించారు. కాంతి వేగానికి దగ్గరగా ప్రయాణించే ఈ 'కిల్లర్ ఎలక్ట్రాన్లు' శాటిలైట్ల రక్షణ కవచాలను సైతం ఛేదించుకుని లోపలికి చొచ్చుకుపోగలవు. ఇవి శాటిలైట్లలోని సున్నితమైన ఎలక్ట్రానిక్ పరికరాలను దెబ్బతీయగలవు, వాటి జీవితకాలాన్ని తగ్గించగలవు.





ఐశ్వర్య-అభిషేక్ విడాకులు.. దీపావళి వేడుకల్లో జంట!

బాలీవుడ్ స్టార్ కపుల్ అభిషేక్ బచ్చన్, ఐశ్వర్యారాయ్ చాలా కాలం తర్వాత అభిమానులను సంతోషపరిచారు. గత కొన్నేళ్లుగా ఈ జంట వైవాహిక జీవితంపై ఎన్నో రకాల వార్తలు ప్రచారంలో ఉన్నాయి. వీరిద్దరి మధ్య విభేదాలు ఉన్నాయని, విడాకులు తీసుకోబోతున్నారంటూ సోషల్ మీడియాలో, బాలీవుడ్ మీడియాలో పలు కథనాలు వచ్చాయి. ఈ వార్తలు అభిమానులను కూడా బాధపెట్టాయి. గతంలో కొన్ని సందర్భాల్లో అభిషేక్, ఐశ్వర్య కలిసి కనిపించినప్పటికీ.. కొన్ని ఫంక్షన్స్ లో వేరువేరుగా కనిపివ్వడం, మరికొన్ని ఫంక్షన్స్ లో అంత ప్రేమగా కనిపియ్యక పోవడం కూడా రూమర్లకు దారితీసింది. దీంతో వీరిద్దరి గురించి రకరకాల ఊహాగానాలు కొనసాగుతూనే ఉన్నాయి. అయితే తాజాగా ఈ జంట మరోసారి అందరి దృష్టిని ఆకర్షించింది. తమపై వస్తున్న పుకార్లకు గట్టిగా సమాధానం చెబుతూ ఇద్దరూ చేతిలో చేయి వేసుకుని ఒకే కార్యక్రమానికి హాజరయ్యారు. నవంబర్ 5న ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ మనీశ్ మల్హోత్రా ముంబైలోని తన నివాసంలో ఘనంగా దీపావళి వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు బాలీవుడ్‌కు చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు. అయితే అందరి కంటే ఎక్కువగా అభిషేక్ బచ్చన్, ఐశ్వర్యారాయ్ జంటే ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ వేడుకకు వచ్చిన సమయంలో అభిషేక్, ఐశ్వర్య ఒకరి చేయి మరొకరు పట్టుకుని నడుస్తూ కనిపించారు.

మా పర్సనల్ లైఫ్‌ను యూజ్ చేసుకోకండి: సురేఖ వాణి

సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలకు సంబంధించిన విషయాలు సోషల్ మీడియాలో వైరల్ కావడం అప్పుడప్పుడు వివాదాలకు దారితీస్తుంటుంది. ముఖ్యంగా వారి పర్మిషన్ లేకుండా ఫొటోలు, వీడియోలను బయటపెట్టడం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పుడు టాలీవుడ్ నటి సురేఖా వాణికి సంబంధించిన ఓ ప్రైవేట్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడం హాట్ టాపిక్ గా మారింది. దీనిపై ఆమె స్పందించి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. తన ఇన్ స్టా అకౌంట్ హ్యాక్ అయిందని వెల్లడించారు. తన పర్మిషన్ లేకుండా వ్యక్తిగత ఫొటోలు, వీడియోలను కొందరు వైరల్ చేస్తున్నారని తెలిపారు. ఆ కంటెంట్ ను ఎవరూ షేర్ చేయొద్దని క్లారిటీ ఇచ్చారు. ముఖ్యంగా మీమ్ పేజీలు, మీడియా సంస్థలు, యూట్యూబ్ ఛానళ్లు వెంటనే దాన్ని ఆపాలని కోరారు. కేవలం వ్యూస్, రీచ్, పబ్లిసిటీ కోసం ఒకరి పర్సనల్ లైఫ్ ను యూజ్ చేసుకోవడం సరికాదని ఆమె పేర్కొన్నారు. తన ప్రైవేట్ కంటెంట్ ను రీపోస్ట్ చేయడం, ఇతరులకు షేర్ చేయడం ఆపాలని వార్నింగ్ ఇచ్చారు. ఆ వీడియోలను వైరల్ చేస్తున్న అకౌంట్స్, వ్యక్తుల వివరాలను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నామని వెల్లడించారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన ప్రూఫులు సేకరిస్తున్నట్లు తెలిపారు. తన పర్సనల్ కంటెంట్ ను ప్రచారం చేసే వారిపై కఠినమైన సైబర్ క్రైమ్ కేసులు, చట్టపరమైన చర్యలు తీసుకుంటానని సురేఖా వాణి క్లారిటీ ఇచ్చారు. ఆ విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గేది లేదని హెచ్చరించారు. తన పర్సనల్ ప్రైవసీని గౌరవించాలని ప్రతి ఒక్కరినీ కోరారు.





'రుక్మిణి'లో నితిన్ స్టన్నింగ్ లుక్



హీరో నితిన్ ఈమధ్య డిఫరెంట్ కాన్సెప్ట్ సినిమాలను లైన్ లో పెడుతూ వస్తున్నాడు. నేచురల్ స్టార్ నాని సమర్పణలో నటిస్తున్న నెక్ట్ మూవీ అలియాస్ రుక్మిణి. దండోరా ఫేమ్ మురళీ కాంత్ దేవసోత్ తెరకెక్కిస్తున్న ఈ ప్రాజెక్ట్ నుంచి మేకర్స్ ఒక ఇంట్రెస్టింగ్ ప్రమోషనల్ వీడియోను విడుదల చేశారు. అందులో నితిన్ లుక్ చూసి నెటిజన్లతో పాటు మూవీ లవర్స్ కూడా కాస్త ఆశ్చర్యపోతున్నారు. ఈ వీడియోను డిజైన్ చేసిన విధానం కూడా డిఫరెంట్ గానే ఉంది. హీరోయిన్ ఆఫియా సయ్యద్, డైరెక్టర్ మురళీ కాంత్ ఇద్దరూ కృష్ణ పాత్ర పాత రోజుల గురించి సరదాగా మాట్లాడుకుంటూ కనిపిస్తారు. పదేళ్ల క్రితం కృష్ణ ఎలా ఉండేవాడో చూడాలని ఉందంటూ హీరోయిన్ అడగ్గానే, నితిన్ సడన్ గా స్క్రీన్ పైకి ఎంట్రీ ఇస్తాడు. ఆ లుక్ చూడగానే హీరోయిన్ నిజంగానే షాక్ అయిపోయి, ఏదైనా టైమ్ మెషీన్ వాడి వచ్చావా అంటూ కామెంట్ చేస్తుంది. నిజంగానే ఇందులో నితిన్ మేకోవర్ చాలా ఫ్రెష్ గా కనిపిస్తోంది. పదేళ్లు వెనక్కి వెళ్లి కాలేజ్ కుర్రాడిలా చాలా యంగ్ గా మారిపోయాడు. నార్మల్ గా ఇలాంటి లుక్స్ ట్రై చేసినప్పుడు మేకప్ ఎక్కువై కొందరికి ఆర్టిఫిషియల్ గా అనిపిస్తుంటుంది. కానీ ఇందులో నితిన్ హెయిర్ స్టైల్, లైట్ మీసకట్టు, పక్కింటి కుర్రాడిలాంటి అమాయకత్వం చాలా నేచురల్ గా కుదిరాయి



సాయిపల్లవి వర్సెస్ కాజల్!

నిన్న భారీ అంచనాల మధ్య ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'రామాయణం' సినిమా చాలా వరకు పాజిటివ్ రివ్యూలు తెచ్చుకుంది. కానీ ఇందులో కొన్ని లోపాలు లేకపోలేదు. విజువల్‌గా ఎంత గొప్పగా ఉన్నప్పటికీ ఎమోషనల్ కనెక్ట్ మిస్సయిందన్నది ఎక్కువమంది చెబుతున్న కంప్లైంట్. ముఖ్యంగా సీతారాముల మధ్య కెమిస్ట్రీ పండలేదని.. ఆ జంటను చూస్తే కలగాల్సిన ఆరాధన భావం కలగలేదని.. అందుకే సినిమా ఎమోషనల్‌గా కదిలించలేదని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. రాముడిగా రణబీర్ కపూర్ బాగానే చేసినా.. తన పక్కన సీతగా సాయిపల్లవి కుదరలేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సాయిపల్లవి బేసిగ్గా మంచి పెర్ఫామరే అయినా.. సీత పాత్రకు ఆమె సూట్ కాలేదని చాలామంది అంటున్నారు. సీత అంటే ముగ్ధ మనోహరమైన అందంతో పాటు ఒక కంపోజర్ ఆశిస్తారు ప్రేక్షకులు. అది సాయిపల్లవిలో మిస్సయిందన్నది ఎక్కువమంది చేస్తున్న కంప్లైంట్.



బికినీపై కృతిసనన్ కామెంట్స్!

తను కెరీర్ ఎప్పుడో ప్రారంభించినా కానీ, ఇటీవల వచ్చిన కాక్‌టైల్ 2లో తప్ప బికినీలో నటించలేదని కృతి సనన్ తెలిపారు. ఈ చిత్రంలోని బికినీ సీన్ గురించి ప్రస్తావిస్తూ.. గ్లామర్ రంగంలో ఒక నటిగా తన ఆలోచనా విధానం కాలక్రమేణా ఎలా మారిందో స్పష్టంగా చెప్పుకొచ్చారు. కృతి సనన్ తన వ్యాఖ్యలలో ప్రధానంగా మానసిక పరిణతికి ప్రాధాన్యత ఇచ్చారు. ఎనిమిదేళ్ల క్రితం తన కెరీర్ ప్రారంభ దశలో ఇటువంటి సన్నివేశంలో నటించాల్సి వస్తే తాను ఎంతమాత్రం సౌకర్యవంగా ఫీలయ్యేదాన్ని కానని ఓపెన్‌గా అంగీకరించారు. వయస్సు పెరగడం.. పరిశ్రమలో సంపాదించిన అనుభవం.. స్వీయ వ్యక్తిత్వంపై ఏర్పడిన నమ్మకమే ఈ రోజు తనను ఈ స్థాయి సెల్ఫ్ అగ్రీ దిశగా నడిపించాయని వివరించారు. శరీర ఆకృతి గురించి మాట్లాడుతూ కృతి ఒక ముఖ్యమైన సందేశాన్ని ఇచ్చారు. కేవలం శారీరక దారుఢ్యం కలిగి ఉండటం కంటే.. ఒక వ్యక్తి తన శరీరంలో పూర్తి సహజంగా, ఆత్మవిశ్వాసంతో ఉండటమే అత్యంత కీలకమైన అంశమని నొక్కి చెప్పారు. బాహ్య సౌందర్యం కంటే అంతర్గత ఆత్మవిశ్వాసమే నిజమైన సౌకర్యాన్ని.. ధైర్యాన్ని అందిస్తుందని కృతి సనోన్ అభిప్రాయపడ్డారు.



కాబోయే భార్యతో సాయి తేజ్!

మెగా హీరో సాయి దుర్గ తేజ్ త్వరలోనే పెళ్లి పీటలెక్కబోతున్నారు. నవంబర్ 5న హైదరాబాద్‌లోని హిల్టన్ జీనోమ్ వ్యాలీ రిసార్ట్‌లో తన చిన్ననాటి ఫ్రెండ్ కిరణ్మయితో ఆయన ఎంగేజ్‌మెంట్ చాలా సింపుల్‌గా, అందంగా జరిగింది. మెగా, అల్లు ఫ్యామిలీ మెంబర్స్ అంతా కలిసి ఈ వేడుకలో సందడి చేశారు. అయితే ఎంగేజ్‌మెంట్ అయిన తర్వాత, తాజాగా తన కాబోయే భార్యతో దిగిన ఒక క్యూట్ ఫొటోను తేజ్ ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. ఈ ఎంగేజ్‌మెంట్ ఫొటోలో సాయి దుర్గ తేజ్, కిరణ్మయిల జంట చూడటానికి ఎంతో ముచ్చటగా ఉంది. తేజ్ ఆల్-వైట్ షేర్వాణీలో చాలా క్లాసిక్‌గా, హ్యాండ్సమ్‌గా కనిపించారు. ఇక కాబోయే పెళ్లికూతురు కిరణ్మయి గ్రీన్ అండ్ గోల్డ్ పట్టు లంగా ఓణి, దానికి మ్యాచింగ్ గోల్డ్ జ్యువెలరీ వేసుకుని ట్రెడిషనల్ లుక్‌లో మెరిసిపోయారు. వీళ్లిద్దరి జంట సూపర్‌గా ఉందంటూ ఫ్యాన్స్ తెగ కామెంట్స్ పెడుతున్నారు.





భారత బౌలర్ల పంజా

134కే కుప్పకూలిన కివీస్

డీఎల్ఎస్‌తో భారత్‌కు విజయం.. సిరీస్‌లో 2-0 ఆధిక్యం

న్యూజిలాండ్‌తో వెల్లింగ్టన్‌లో శనివారం జరిగిన రెండో వన్డేలో టీమిండియా 4 పరుగుల తేడాతో గెలిచింది. దీంతో ఐదు వన్డేల సిరీస్‌లో 2-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. తొలుత భారత బౌలర్లు అదరగొట్టి కివీస్‌ను 134 పరుగులకే కట్టడి చేశారు. లక్ష్య ఛేదనలో భారత బ్యాటర్లు తడబడినా.. చివర్లో వర్షం రావడంతో డీఎల్ఎస్ పద్ధతి భారత్‌కు విజయాన్ని అందించింది.

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్‌ను భారత పేసర్లు ఆరంభంలోనే దెబ్బతీశారు. అఖిబ్ నబీ రెండు వికెట్లు తీసి కివీస్‌ను ఒత్తిడిలోకి నెట్టాడు. అన్షుల్ కాంబోజ్ కూడా రెండు వికెట్లు పడగొట్టాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా డారిల్ మిచెల్ మాత్రం పట్టుదలగా ఆడాడు. 104 బంతుల్లో 55 పరుగులు చేసి జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించే ప్రయత్నం చేశాడు.

గ్లెన్ ఫిలిప్స్, టామ్ లాథమ్ ఎక్కువసేపు నిలవలేకపోయారు. కెప్టెన్ మిచెల్ సాంట్నర్ 31 పరుగులతో రాణించాడు. చివరకు 41 ఓవర్లలో కివీస్ 134 పరుగులకు ఆలౌటైంది. గుర్నూర్ బ్రార్ నాలుగు వికెట్లతో సత్తాచాటగా.. అఖిబ్ నబీ, అన్షుల్ కాంబోజ్, అక్షర్ పటేల్ రెండేసి వికెట్లు తీశారు. స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆదిలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ గోల్డెన్ డక్‌గా వెనుదిరగగా.. విరాట్ కోహ్లీ 7 పరుగులకే ఔటయ్యాడు. రోహిత్ శర్మ 23, శ్రేయస్ అయ్యర్ 30 పరుగులు చేసి ఆదుకునే ప్రయత్నం చేశారు. అయితే క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోవడంతో భారత్ కష్టాల్లో పడింది. కేఎల్ రాహుల్ 26 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. 26 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 113 పరుగులు చేసిన సమయంలో వర్షం మొదలైంది. ఎంతసేపటికీ ఆట తిరిగి ప్రారంభం కాకపోవడంతో మ్యాచ్‌ను రద్దు చేశారు. డీఎల్ఎస్ లెక్కల ప్రకారం భారత్ 4 పరుగుల తేడాతో విజేతగా నిలిచింది. చివరి వరకు పోరాడిన కివీస్‌కు నిరాశే ఎదురైంది.

గుర్నూర్ అదుర్స్: గిల్

న్యూజిలాండ్‌తో రెండో వన్డేలో భారత యువ పేసర్ గర్నూర్ బ్రార్ అద్భుత ప్రదర్శనపై కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ప్రశంసలు కురిపించాడు. అతడిలో మంచి వేగం, బౌన్స్ ఉన్నాయని.. బౌలింగ్‌లో నిలకడ పెంచుకుంటే మరింత రాణించగలడని అభిప్రాయపడ్డాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఒత్తిడిని తట్టుకుని ఆడటమే యువ బౌలర్లకు కీలకమని స్పష్టం చేశాడు. వెల్లింగ్టన్‌లో శనివారం జరిగిన రెండో వన్డేలో గర్నూర్ తన సత్తా చాటాడు. 10 ఓవర్లు వేసి 30 పరుగులిచ్చి నాలుగు వికెట్లు పడగొట్టాడు. బౌన్స్‌కు అనుకూలించిన పిచ్‌పై తన ఎత్తు, వేగాన్ని చక్కగా ఉపయోగించుకున్నాడు. కివీస్ బ్యాటర్లను ఇబ్బంది పెట్టి ఆ జట్టును 134 పరుగులకే ఆలౌట్ చేయడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ ప్రదర్శనకు గర్నూర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. మ్యాచ్ అనంతరం గిల్ మాట్లాడుతూ.. గత మ్యాచ్‌లోనూ గర్నూర్ బాగా బౌలింగ్ చేశాడని గుర్తుచేశాడు. మరిన్ని మ్యాచ్‌లు ఆడుతూ అనుభవం సంపాదిస్తే లైన్, లెంగ్త్‌లో నిలకడ పెరుగుతుందని చెప్పాడు.





బాల్ ట్యాంపరింగ్ కుట్ర.. జట్టు మొత్తానికీ తెలుసు

ఆస్ట్రేలియా క్రికెట్‌ను ప్రపంచవ్యాప్తంగా అప్రతిష్టపాలు చేసిన 2018 నాటి 'శాండ్‌పేపర్ గేట్' ఉదంతంపై ఆ జట్టు మాజీ ఓపెనర్ ఉస్మాన్ ఖవాజా సంచలన ఆరోపణలు చేశాడు. ఈ బాల్ ట్యాంపరింగ్ కుట్ర గురించి కేవలం ముగ్గురు ఆటగాళ్లకు మాత్రమే కాదని, పర్యటనలో ఉన్న జట్టు సభ్యులందరికీ ముందే తెలుసని బాంబు పేల్చాడు. తన ఆత్మకథ 'సర్వ్'లో ఈ విషయాలను వెల్లడించాడు. ఈ పుస్తకంలోని కొన్ని కీలక భాగాలను ఆస్ట్రేలియా వార్తాపత్రికలు ప్రచురించడంతో ఎనిమిదేళ్ల నాటి ఈ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. ఖవాజా తన పుస్తకంలో.. "ఆ తప్పు మా అందరిదీ. కేవలం బ్యాటర్లు, బౌలర్లు లేదా సహాయక సిబ్బంది మాత్రమే కాదు. మేమంతా అందులో భాగస్వాములమే" అని స్పష్టంగా పేర్కొన్నాడు. 2018లో దక్షిణాఫ్రికాతో జరిగిన కేప్‌టౌన్ టెస్టులో కామెరాన్ బాన్‌క్రాఫ్ట్ శాండ్‌పేపర్‌తో బంతిని రుద్దుతూ కెమెరాకు చిక్కిన విషయం తెలిసిందే. అయితే, ఈ ఘటనకు ముందే పోర్ట్ ఎలిజబెత్ (ప్రస్తుతం గెబెర్హా)లో జరిగిన టెస్టులోనే జట్టు శాండ్‌పేపర్‌ను ఉపయోగించిందని ఖవాజా ఆరోపించాడు. బంతిని ఒకవైపు రఫ్‌గా మార్చేందుకు డ్రెస్సింగ్ రూమ్‌లో బహిరంగంగా చర్చలు జరిగాయని, ఆ క్రమంలోనే శాండ్‌పేపర్ సమర్థవంతమైన మార్గమని తేలిందని వివరించాడు. ఈ విషయం తెలిసిన తర్వాత అప్పటి కెప్టెన్ స్టీవ్ స్మిత్, తనకు పూర్తి వివరాలు తెలియాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించినట్లు ఖవాజా గుర్తు చేసుకున్నాడు. అప్పట్లో క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) జరిపిన విచారణలో ఈ కుట్ర గురించి కెప్టెన్ స్టీవ్ స్మిత్, వైస్-కెప్టెన్ డేవిడ్ వార్నర్, బాన్‌క్రాఫ్ట్‌లకు మాత్రమే ముందస్తు సమాచారం ఉందని తేల్చింది. ఈ ముగ్గురిపై చర్యలు తీసుకుంది. స్మిత్, వార్నర్‌లపై 12 నెలల నిషేధం విధించగా, బాన్‌క్రాఫ్ట్‌పై 9 నెలల వేటు వేసింది. స్మిత్ తన కెప్టెన్సీని కూడా కోల్పోయాడు.

న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్‌కు 'పంత్' క్లియర్

టీమిండియా వికెట్ కీపర్-బ్యాటర్ రిషభ్ పంత్ తిరిగి జట్టులోకి పునరాగమనం చేయడానికి సిద్ధమయ్యాడు. నవంబర్ 19న వెల్లింగ్టన్‌లో న్యూజిలాండ్‌తో ప్రారంభమయ్యే తొలి టెస్టుకు అతడు అందుబాటులో ఉండే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. గాయం నుంచి కోలుకున్న పంత్, వచ్చే వారం న్యూజిలాండ్‌కు బయలుదేరనున్నాడు.



అక్టోబర్ ఆరంభంలో జరిగిన ఇరానీ కప్‌లో పంత్ సైడ్ స్ట్రెయిన్ గాయానికి గురయ్యాడు. దీంతో అతడు కొంతకాలంగా బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో పునరావాసంలో ఉన్నాడు. గురువారం అతడు నెట్స్‌లో ఎలాంటి ఇబ్బంది లేకుండా బ్యాటింగ్ చేస్తున్న వీడియోను పంచుకున్నాడు. దీంతో పంత్ పూర్తి ఫిట్‌నెస్ సాధించినట్లు స్పష్టమైంది. గాయం కారణంగా పంత్, న్యూజిలాండ్‌లో పర్యటిస్తున్న ఇండియా-ఎ జట్టుకు దూరమయ్యాడు. ఈ నెల ఆరంభంలో నిర్వహించిన ఫిట్‌నెస్ పరీక్షలో విఫలమయ్యాడు. శనివారం ప్రారంభమైన మూడో అనధికారిక టెస్టుకి కూడా అందుబాటులో లేకుండా పోయాడు. దీంతో ఇండియా-ఎ జట్టులో అతడి స్థానంలో తిలక్ వర్మను చేర్చారు. మరోవైపు, సీనియర్ ఆటగాళ్లు జస్ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా టెస్టు సిరీస్‌కు సన్నద్ధమయ్యేందుకు ఇండియా-ఎ జట్టు తరఫున చివరి వార్మప్ మ్యాచ్ ఆడుతున్నారు.

షమీ విషయంలో సెలక్టర్లు తప్పు చేశారు: రవిశాస్త్రి

భారత సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ అనూహ్యంగా టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించడంపై మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి స్పందించాడు. సుదీర్ఘకాలంగా సెలక్టర్లు తనను పక్కన పెట్టడంతోనే షమీ ఈ కఠిన నిర్ణయం తీసుకున్నాడని, ఇది చాలా బాధాకరమని అన్నాడు. షమీ విషయంలో సెలక్టర్లు అనుసరించిన వైఖరిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. గత మూడేళ్లుగా టెస్ట్ జట్టులో చోటు దక్కకపోవడంతో షమీ తన రెడ్-బాల్ కెరీర్‌కు ముగింపు పలికిన సంగతి తెలిసిందే. ఈ నిర్ణయంపై భారత్-న్యూజిలాండ్ రెండో వన్డే సందర్భంగా రవిశాస్త్రి మాట్లాడుతూ.. "దేశం కోసం అద్భుతంగా ఆడిన ఒక ఆటగాడు ఇలా తప్పుకోవడం విచారకరం. అతనిలో ఇంకా 30 నుంచి 40 టెస్ట్ వికెట్లు తీసే సత్తా ఉందని నేను కచ్చితంగా భావించాను. గత 12 నెలల్లో అతనికి అవకాశం ఇచ్చి ఉండాల్సింది. ఒక టెస్ట్ మ్యాచ్ బౌలర్‌గా అతను జట్టులో ఉండాల్సింది" అని అభిప్రాయపడ్డాడు. ఆటగాళ్ల ఫిట్‌నెస్‌ను అంచనా వేయడానికి కేవలం జిమ్-ఆధారిత పరీక్షలపై ఆధారపడటాన్ని కూడా శాస్త్రి తప్పుబట్టాడు. "ఒక మ్యాచ్‌లో 10 లేదా 12 ఓవర్లు బౌలింగ్ చేయలేకపోతే జిమ్‌లో ఫిట్‌గా ఉండి ఏం ప్రయోజనం? ఇక్కడ మీకు ఒక వర్క్‌హార్స్ (కష్టపడి పనిచేసే బౌలర్) అందుబాటులో ఉన్నాడు. అతనికి మరో అవకాశం ఇవ్వకపోవడం నన్ను తీవ్రంగా నిరాశపరిచింది" అని శాస్త్రి ఆవేదన వ్యక్తం చేశాడు. షమీ ఫిట్‌నెస్‌పై వస్తున్న నివేదికలను కూడా శాస్త్రి కొట్టిపారేశాడు.



జైస్వాల్ వరుస సెంచరీలు

భారత యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. న్యూజిలాండ్-ఎతో జరుగుతున్న మూడో, చివరి అనధికారిక టెస్టులో వరుసగా రెండో సెంచరీ సాధించి సత్తా చాటాడు. అతడి శతకానికి తోడు మరో ఓపెనర్ సాయి సుదర్శన్ అర్ధ సెంచరీతో రాణించడంతో తొలి రోజు ఆటలో భారత్-ఎ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. లింకన్‌లోని బర్ట్ సట్‌క్లిఫ్ ఓవల్ మైదానంలో శనివారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన న్యూజిలాండ్-ఎ ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన భారత్-ఎకు ఓపెనర్లు యశస్వి, సాయి సుదర్శన్ అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చారు. ముఖ్యంగా యశస్వి తన దూకుడును కొనసాగిస్తూ కివీస్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 138 బంతుల్లో 16 ఫోర్లు, 2 భారీ సిక్సర్లతో 102 పరుగులు చేసి ఔటయ్యాడు. సాయి సుదర్శన్‌తో కలిసి తొలి వికెట్‌కు 175 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఈ వారం క్రైస్ట్‌చర్చ్‌లో జరిగిన రెండో అనధికారిక టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో యశస్వి అజేయంగా 155 పరుగులు చేసిన విషయం తెలిసిందే. ఈ పర్యటన ఆరంభంలో వరుసగా 17, 5, 0 స్కోర్లతో విఫలమైనప్పటికీ, ఆ తర్వాత వరుస శతకాలతో తిరిగి ఫామ్‌లోకి రావడం విశేషం. కాగా, న్యూజిలాండ్‌తో జరగనున్న టెస్ట్ సిరీస్‌కు ముందు మ్యాచ్ ప్రాక్టీస్ కోసం జస్‌ప్రీత్ బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ, రవీంద్ర జడేజా, తిలక్ వర్మ వంటి సీనియర్ ఆటగాళ్లు ఈ మ్యాచ్‌లో ఆడుతున్నారు. గాయం నుంచి కోలుకున్న బుమ్రా నవంబర్ 2025 తర్వాత ఆడుతున్న తొలి రెడ్-బాల్ మ్యాచ్ ఇదే కావడం గమనార్హం. ఈ వరుస సెంచరీలతో, నవంబర్ 19న వెల్లింగ్‌టన్‌లో ప్రారంభం కానున్న న్యూజిలాండ్ టెస్ట్ సిరీస్‌కు భారత సీనియర్ జట్టులో చోటు కోసం యశస్వి తన పోటీని మరింత పటిష్ఠం చేసుకున్నాడు.



పాంటింగ్ రికార్డు బద్దలు కొట్టిన కోహ్లీ

టీమిండియా స్టార్ బ్యాటర్, రన్ మెషీన్ విరాట్ కోహ్లీ మరో ప్రపంచ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. వెల్లింగ్టన్‌లోని సెల్హ్లో బేసిన్ రిజర్వ్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన రెండో వన్డేలో, ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్‌ను అధిగమించి కివీస్‌పై వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. ఈ మ్యాచ్‌లో 135 పరుగుల లక్ష్య ఛేదనలో కోహ్లీ 7 పరుగులు మాత్రమే చేసినప్పటికీ, ఈ అరుదైన ఘనతను అందుకున్నాడు. ఈ మ్యాచ్ ప్రారంభానికి ముందు కోహ్లీ, పాంటింగ్ ఇద్దరూ న్యూజిలాండ్‌పై 1,971 పరుగులతో సమంగా ఉన్నారు. తాను ఎదుర్కొన్న రెండో బంతికే బౌండరీ బాదిన కోహ్లీ, పాంటింగ్‌ను వెనక్కి నెట్టి అగ్రస్థానానికి దూసుకెళ్లాడు. ఆస్ట్రేలియా దిగ్గజం రికీ పాంటింగ్ ఈ మైలురాయిని 51 మ్యాచ్‌ల్లోని 50 ఇన్నింగ్స్‌లలో చేరుకోగా, విరాట్ కోహ్లీ కేవలం 38 ఇన్నింగ్స్‌లలోనే ఈ ఘనత సాధించడం విశేషం. పాంటింగ్ కివీస్‌పై 45.83 సగటుతో 6 సెంచరీలు, 12 అర్ధ సెంచరీలు నమోదు చేశాడు. ప్రస్తుతం కోహ్లీ 1,978 పరుగులతో ఈ జాబితాలో మొదటి స్థానంలో ఉన్నాడు. ఈ సిరీస్‌లో ఇంకా మూడు మ్యాచ్‌లు మిగిలి ఉన్న నేపథ్యంలో న్యూజిలాండ్‌పై 2,000 వన్డే పరుగులు పూర్తి చేసిన తొలి ఆటగాడిగా నిలిచే సువర్ణావకాశం కోహ్లీ ముందుంది.

ఈవార్తలు
ప్రజావాణి
ఆదివారం 8-11-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు

నేటి ఈవార్తలు **సంపాదకీయం** Editorial

దేశ భద్రతకు తిరుగులేని భరోసా

దేశ భద్రత అనేది కేవలం సరిహద్దుల్లో సైనికులను మోహరించడంతోనే పూర్తయ్యేది కాదు. శత్రువుల కదలికలను ముందుగానే పసిగట్టే నిఘా వ్యవస్థలు, ఆకాశం నుంచి వచ్చే ముప్పులను అడ్డుకునే క్షిపణులు, సముద్ర మార్గాలను కాపాడే యుద్ధ నౌకలు, అత్యాధునిక యుద్ధ విమానాలు, సైబర్ దాడులను తిప్పికొట్టే సాంకేతిక పరిజ్ఞానం.. ఇవన్నీ కలిసినప్పుడే సమగ్ర రక్షణ సాధ్యమవుతుంది. ఈ దిశగా భారత్ సాగిస్తున్న ప్రయాణం దేశ భద్రతా చరిత్రలో కొత్త అధ్యాయాలను లిఖిస్తోంది. రక్షణ రంగంలో స్వదేశీ పరిజ్ఞానానికి ప్రాధాన్యం పెరగడం ఈ మార్పులో అత్యంత కీలకం. ఒకప్పుడు అత్యాధునిక ఆయుధాల కోసం ఇతర దేశాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు దేశీయ పరిశోధన, అభివృద్ధి సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేటు పరిశ్రమలు కలిసి సరికొత్త ఆయుధ వ్యవస్థలను రూపొందిస్తున్నాయి. ఇది కేవలం దిగుమతులను తగ్గించే ప్రయత్నం మాత్రమే కాదు. యుద్ధ సమయంలో ఇతర దేశాల నిర్ణయాలపై ఆధారపడకుండా స్వతంత్రంగా వ్యవహరించే వ్యూహాత్మక సామర్థ్యాన్ని పెంచుకునే ప్రక్రియ. క్షిపణి సాంకేతికతలో భారత్ సాధిస్తున్న పురోగతి అంతర్జాతీయంగా ప్రత్యేక గుర్తింపు పొందుతోంది. అగ్ని-4, అగ్ని-5 క్షిపణుల పరీక్షలు, ప్రళయ్ క్షిపణుల ప్రయోగాలు, పినాకా దీర్ఘశ్రేణి మార్గదర్శక రాకెట్ పరీక్షలు దేశ క్షిపణి సామర్థ్యాన్ని విస్తరిస్తున్నాయి. ముఖ్యంగా బహుళ అంచెల బాలిస్టిక్ క్షిపణి రక్షణ వ్యవస్థ పరీక్షల్లో విజయం సాధించడం శత్రువుల క్షిపణి దాడులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంచే పరిణామం. నౌకా విధ్వంసక క్షిపణుల అభివృద్ధి సముద్ర భద్రతకు అదనపు బలాన్నిస్తోంది. ఇక వాయు రక్షణ వ్యవస్థల్లోనూ కీలక ముందడుగులు పడుతున్నాయి. 2026 సెప్టెంబరులో సుదూర భూ-వాయు క్షిపణి వ్యవస్థ 'కుశ' తొలి ప్రయోగ పరీక్షను డీఆర్‌డీఓ విజయవంతంగా నిర్వహించింది. హైదరాబాద్‌లో అత్యాధునిక ఆయుధ వ్యవస్థల సముదాయాన్ని ఏర్పాటు చేయడం కూడా రక్షణ పరిశోధనకు నగరం కేంద్రంగా ఎదిగేందుకు దోహదపడుతుంది. శత్రువుల యుద్ధ విమానాలు, క్షిపణులు, మానవరహిత విమానాల నుంచి దేశ గగనతలాన్ని కాపాడుకోవడానికి ఇలాంటి సాంకేతికతలు అత్యవసరం. దేశీయ రక్షణ ఉత్పత్తిలో నమోదవుతున్న గణాంకాలు ఈ మార్పునకు అద్దం పడుతున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో భారత రక్షణ ఉత్పత్తి విలువ రూ.1.78 లక్షల కోట్లకు చేరడం విశేషం. రక్షణ ఎగుమతులు రూ.38,424 కోట్లకు పెరిగాయి. 80కి పైగా దేశాలకు భారత రక్షణ ఉత్పత్తులు చేరుతున్నాయి. ఒకప్పుడు ఆయుధాల కోసం విదేశాల వైపు చూసిన భారత్.. ఇప్పుడు అంతర్జాతీయ మార్కెట్‌కు రక్షణ పరికరాలను అందించే స్థాయికి ఎదగడం గమనించాల్సిన పరిణామం. 2029 నాటికి రక్షణ ఉత్పత్తిని రూ.3 లక్షల కోట్లకు, ఎగుమతులను రూ.50 వేల కోట్లకు చేర్చాలన్న లక్ష్యాలు ఈ రంగంలో మరింత విస్తరణకు దిశానిర్దేశం చేస్తున్నాయి. అయితే రక్షణ రంగంలో సాధించే ప్రతి విజయం వెనుక శాస్త్రవేత్తల శ్రమ, సైనికుల అంకితభావం, సాంకేతిక నిపుణుల ప్రతిభ ఉంటాయి. వారికి అవసరమైన ప్రోత్సాహం, పరిశోధనలకు తగిన నిధులు, నూతన ఆవిష్కరణలకు అవకాశాలు కల్పించాలి. ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు ప్రైవేటు పరిశ్రమలు, నూతన సంస్థలు, విద్యాసంస్థలను భాగస్వాములను చేయాలి. ముఖ్యంగా కృత్రిమ మేధ, అంతరిక్ష నిఘా, సైబర్ భద్రత, స్వయంచాలక యుద్ధ వ్యవస్థలు, అత్యాధునిక యంత్ర చోదక పరిజ్ఞానంపై పెట్టుబడులు పెంచాలి. అదే సమయంలో ఆయుధాలను తయారు చేయడమే కాదు.. వాటి నిర్వహణ, మరమ్మతులు, విడిభాగాల లభ్యత, నిరంతర నవీకరణలపైనా దృష్టి సారించాలి. సరిహద్దుల్లో మౌలిక సదుపాయాలు, సైనికులకు ఆధునిక రక్షణ పరికరాలు, త్రివిధ దళాల మధ్య సమన్వయం మరింత మెరుగుపడాలి. దేశీయ తయారీ లక్ష్యాలు నాణ్యతతో కూడిన ఉత్పత్తులుగా మారాలి.

యువశక్తితోనే వికసించాలి నవభారతం



దీపావళి అంటే కేవలం దీపాలు వెలిగించడం, టపాసులు కాల్చడం, మిఠాయిలు పంచుకోవడం మాత్రమే కాదు. చీకటిపై వెలుగు, చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి ప్రతీక. ప్రతి ఇంట్లో దీపం వెలిగే ఈ పండుగ.. ప్రతి ఒక్కరి జీవితంలోనూ కొత్త ఆలోచనలకు వెలుగులు నింపాలి. ముఖ్యంగా దేశ భవిష్యత్తును నిర్ణయించబోయే యువతకు దీపావళి ఒక సందేశం కావాలి.

వ్యక్తిగత విజయాలకే పరిమితం కాకుండా దేశ ప్రగతిలో భాగస్వాములు కావాల్సిన సమయం ఆసన్నమైంది. భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన దేశాల్లో ఒకటి. ఈ జనాభా మనకు ఉన్న గొప్ప సంపద. అయితే యువత సంఖ్య ఎక్కువగా ఉండటమే దేశానికి బలం కాదు. వారి ఆలోచనలు, నైపుణ్యాలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలే నిజమైన బలం. యువతలో ఉన్న సృజనాత్మకతను, శక్తిని సరైన దిశలో నడిపించగలిగితే భారత్ ప్రపంచానికి మార్గదర్శకంగా నిలుస్తుంది. లేకపోతే అదే యువశక్తి నిరుద్యోగం, నిరాశ, వ్యసనాలు, సామాజిక సమస్యల మధ్య చిక్కుకుపోయే ప్రమాదం ఉంది. నేటి యువత ముందు అవకాశాలతో పాటు సవాళ్లూ ఉన్నాయి. సాంకేతిక పరిజ్ఞానం ప్రపంచాన్ని అరచేతిలోకి తెచ్చింది. కృత్రిమ మేధ, అంతరిక్ష పరిశోధనలు, జీవసాంకేతికత, రక్షణ రంగం, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వంటి రంగాలు కొత్త అవకాశాలను సృష్టిస్తున్నాయి. వీటిని కేవలం ఉద్యోగాల కోసం మాత్రమే కాకుండా దేశ నిర్మాణానికి ఉపయోగించుకోవాలి. కొత్త ఆవిష్కరణలు చేయాలి. ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలి. విదేశాలకు వెళ్లి స్థిరపడటమే విజయానికి కొలమానం కాదని, మన దేశంలోనే ప్రపంచ స్థాయి సంస్థలను నిర్మించగలమనే ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలి. అదే సమయంలో విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనం, శాస్త్రీయ దృక్పథం, ప్రశ్నించే తత్వం, సామాజిక స్పృహ అలవర్చుకోవాలి. సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రతి సమాచారాన్ని నిజమని నమ్మకుండా వాస్తవాలను పరిశీలించాలి. తప్పుడు ప్రచారాలకు, విద్వేషపూరిత ఆలోచనలకు దూరంగా ఉండాలి. కులం, మతం, ప్రాంతం పేరుతో సమాజాన్ని విడదీసే శక్తులకు యువత బలికాకూడదు. భిన్నత్వంలో ఏకత్వమే భారతదేశానికి అసలైన బలమనే విషయాన్ని గుర్తించాలి. దేశ భవిష్యత్తు అంటే కేవలం పెద్ద పెద్ద భవనాలు, రహదారులు, పరిశ్రమలు, ఆర్థిక వృద్ధి మాత్రమే కాదు. రైతు బాగుండాలి. కార్మికుడికి గౌరవం దక్కాలి. మహిళలకు భద్రత ఉండాలి. పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం అందాలి. గ్రామీణ ప్రాంతాల్లోనూ అభివృద్ధి ఫలాలు చేరాలి. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఈ లక్ష్యాల సాధనలో యువత భాగస్వామ్యం కావాలి. ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలి. ప్రజాస్వామ్య విలువలను కాపాడాలి. ప్రశ్నించాల్సిన చోట ప్రశ్నించాలి. తప్పును తప్పుగా చెప్పగల ధైర్యాన్ని అలవర్చుకోవాలి. మరోవైపు మాదకద్రవ్యాలు, ఆన్‌లైన్ వ్యసనాలు, అర్థంలేని విలాసాలు, క్షణికావేశాలు యువత భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయి. సంపాదన, హోదా, వ్యక్తిగత సౌకర్యాలే జీవిత పరమావధి కాకూడదు. కుటుంబ విలువలు, మానవత్వం, సేవాభావం కూడా జీవితంలో భాగం కావాలి. ఒకరి జీవితంలో వెలుగు నింపగలిగితే అదే నిజమైన పండుగ. ఒక పేద విద్యార్థికి చదువులో తోడ్పడటం, ఒక నిరుపేద కుటుంబానికి అండగా నిలవడం, ఒక మొక్కను నాటి పెంచడం.. ఇవన్నీ సమాజానికి వెలుగునిచ్చే దీపాలే. భారతదేశం 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఆ లక్ష్యం నెరవేరాలంటే ప్రభుత్వ విధానాలు, పాలకుల సంకల్పం మాత్రమే సరిపోవు. యువత భాగస్వామ్యం అత్యంత కీలకం. నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలు, ఉపాధ్యాయులు, పరిపాలకులు, ప్రజాప్రతినిధులు. వారు తీసుకునే నిర్ణయాలు, అలవర్చుకునే విలువలు, ఎంచుకునే మార్గాలే రేపటి భారతదేశ రూపురేఖలను నిర్ణయిస్తాయి. దీపావళి యువతకు ఒక కొత్త ప్రతిజ్ఞకు వేదిక కావాలి. నిరక్షరాస్యతపై అక్షరాన్ని, నిరుద్యోగంపై నైపుణ్యాన్ని, మూఢనమ్మకాలపై విజ్ఞానాన్ని, అవినీతిపై నిజాయతీని, విద్వేషంపై మానవత్వాన్ని గెలిపించాలి. ప్రతి యువకుడు తన జీవితంలో ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. ఆ లక్ష్యం తన ఎదుగుదలతోపాటు దేశ అభివృద్ధికి కూడా దోహదపడేలా ఉండాలి. ప్రతి ఇంటి ముందు వెలిగే దీపం దేశానికి వెలుగునివ్వదు. కానీ ప్రతి యువకుడి మనసులో వెలిగే జ్ఞానదీపం, బాధ్యతాదీపం, దేశభక్తి దీపం కోట్లాది జీవితాల్లో మార్పు తీసుకురాగలదు. టపాసుల శబ్దం కొన్ని క్షణాలే వినిపిస్తుంది. కానీ యువత సాధించే విజయాలు తరతరాలకు స్ఫూర్తినిస్తాయి. ఈ దీపావళి అలాంటి విజయాలకు నాంది కావాలి. యువతే దేశానికి సంపద.. యువత ఆలోచనలే దేశానికి దిక్సూచి.. యువత సంకల్పమే నవభారత నిర్మాణానికి పునాది కావాలి. అప్పుడే దీపావళి నిజమైన అర్థంలో దేశ భవిష్యత్తును వెలిగించే పండుగ అవుతుంది.



రామ్ మనోహర్ శర్మ
ఆధ్యాత్మిక పండితుడు



అతిపెద్ద సమూహం.. 'బీసీ' గొంతెక్కడ?

ప్రపంచ రాజకీయ, సామాజిక వ్యవస్థలను పరిశీలిస్తే ఒక విషయం స్పష్టంగా కనిపిస్తుంది. ఏ సమాజమైనా జనాభా సంఖ్యతో మాత్రమే గుర్తింపు పొందదు. సంస్థాగత బలం, నాయకత్వం, రాజకీయ ప్రాతినిధ్యం, అంతర్జాతీయ సంబంధాలు ,ఆ సమాజ యొక్క అభివృద్ధి, శక్తినీ నిర్ణయిస్తాయి. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో ఒక వర్గం లేదా మత సమూహంపై వివక్ష, దాడులు జరిగినప్పుడు సంబంధిత సంస్థలు, వారికి మద్దతుగా స్పందించడం చూస్తుంటాం. ముస్లిం సమాజానికి అంతర్జాతీయ స్థాయిలో వివిధ మత, రాజకీయ వేదికలు ఉన్నాయి. క్రైస్తవులలో కాథలిక్ చర్చి, వాటికన్ వంటి సంస్థాగత వ్యవస్థ ఉంది. హిందూ జాతీయవాద భావజాలాన్ని ముందుకు తీసుకెళ్లే సంస్థల్లో ఆర్ఎస్ఎస్ ఒకటి. సిక్కులకు గురుద్వారా సంస్థల నెట్‌వర్క్, షెడ్యూల్ కాస్ట్‌కు అంబేద్కర్ ఆలోచనా స్ఫూర్తితో ఏర్పడిన ఉద్యమాలు, ఆదివాసీలకు వివిధ సామాజిక, సాంస్కృతిక, సేవాలాల్ మహరాజ్ వేదికలు ఉన్నాయి. మరి భారతదేశంలోని బీసీల విషయంలో ఇలాంటి సమన్వయంతో కూడిన జాతీయ గొంతుక వేదిక ఎందుకు లేదు?

భారతదేశంలోని ఇతర వెనుకబడిన తరగతుల జనాభా గురించి చర్చించేటప్పుడు మండల్ కమిషన్ నివేదిక ఒక ముఖ్యమైన చారిత్రక ఆధారం. 1980లో సమర్పించిన ఈ నివేదిక, 1931 జనాభా లెక్కల ఆధారంగా దేశ జనాభాలో ఓబీసీల వాటాను సుమారు 52 శాతంగా అంచనా వేసింది. ఇది ప్రస్తుత అధికారిక జనాభా గణాంకం కాదు. అయినప్పటికీ, ఈ చారిత్రక అంచనా ప్రకారం బీసీల జనాభా ప్రపంచంలోని అనేక ఐరోపా దేశాల జనాభా కంటే ఎక్కువ. ఇంతటి పెద్ద జనాభా ఉన్నప్పటికీ సామాజిక గుర్తింపు, రాజకీయ ప్రాతినిధ్యం, ఆర్థిక అవకాశాలు, నిర్ణయాధికారం కోసం బీసీలు ఇంకా పోరాడాల్సి రావడం ప్రజాస్వామ్యం ముందు ఒక పెద్ద ప్రశ్న. బీసీల సమస్య కేవలం రిజర్వేషన్లకు మాత్రమే పరిమితం కాదు. వ్యవసాయం, పశుపోషణ, చేతివృత్తులు, సంప్రదాయ వృత్తులు, చిన్న వ్యాపారాలు, సేవారంగాలు వంటి దేశ ఆర్థిక వ్యవస్థకు పునాదిగా ఉన్న అనేక రంగాల్లో బీసీల పాత్ర కీలకమైనది. అయినప్పటికీ ఉన్నత విద్య, నాణ్యమైన ఉపాధి, ప్రభుత్వ ఉద్యోగాలు, పారిశ్రామిక రంగం, పరిపాలనా వ్యవస్థ, రాజకీయ నిర్ణయాల్లో వారి వాస్తవ ప్రాతినిధ్యంపై సమగ్ర అధ్యయనం ఎంతో అవసరం. జనాభాలో పెద్ద వాటా ఉండటం ఒక బలం కావచ్చు. కానీ ఆ బలం విధాన నిర్ణయాల్లో భాగస్వామ్యంగా మారినప్పుడే దానికి నిజమైన అర్థం ఉంటుంది.

సామాజిక న్యాయం దిశగా మండల్ కమిషన్ సిఫార్సుల ఆధారంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 27 శాతం ఓబీసీ రిజర్వేషన్లు అమలులోకి రావడం, 2006లో కేంద్ర విద్యాసంస్థల్లో ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించడం ముఖ్యమైన పరిణామాలు. 2018లో 102వ రాజ్యాంగ సవరణ ద్వారా జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్‌కు రాజ్యాంగబద్ధ హోదా లభించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 338బీ ప్రకారం ఈ కమిషన్ వెనుకబడిన తరగతులకు కల్పించిన రక్షణలను పర్యవేక్షించడం, హక్కుల ఉల్లంఘనలపై విచారణ చేయడం, ప్రభుత్వాలకు సలహాలు ఇవ్వడం వంటి బాధ్యతలు కలిగి ఉంది. కాన్నీ వాటి పన్ని తీరులో మాత్రం నిబద్ధత లేదు. ఇక్కడ ప్రధాన సమస్య బీసీ సంఘాలు లేకపోవడం కాదు; ఉన్న సంఘాల మధ్య సమన్వయం లేకపోవడం. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో కుల సంఘాలు, ఉద్యోగ సంఘాలు, విద్యార్థి సంఘాలు, రాజకీయ సంస్థలు, సామాజిక ఉద్యమాలు పనిచేస్తున్నాయి. కానీ అనేక సందర్భాల్లో వాటి కార్యాచరణ ఒక కులం లేదా ప్రాంతం సమస్యలకే పరిమితమవుతోంది. ఒక కులానికి సమస్య వచ్చినప్పుడు ఆ కుల సంఘం స్పందిస్తుంది. మరో కులానికి సమస్య వచ్చినప్పుడు మరో సంఘం ముందుకొస్తుంది. ఈ స్పందనలు అవసరమే. అయితే విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం, ఆర్థిక అభివృద్ధి, కులగణన, సామాజిక గౌరవం వంటి ఉమ్మడి అంశాలపై దేశవ్యాప్తంగా నిరంతరంగా పనిచేసే సమన్వయ వేదిక బలపడాల్సి అవసరం ఉంది. బీసీల మధ్య భాష, ప్రాంతం, కులం, వృత్తి ఆధారంగా అనేక భిన్నత్వాలు ఉన్నాయి. ఆ భిన్నత్వాలను గౌరవిస్తూనే ఉమ్మడి హక్కుల కోసం కలిసి పనిచేయడం నిజమైన ఐక్యత. ఇందుకు పరిశోధన ఆధారిత ఉద్యమం అవసరం. విద్యా స్థితిగతులు, ఉద్యోగాల్లో ప్రాతినిధ్యం, భూమి పంపిణీ, సంప్రదాయ వృత్తుల సంక్షోభం, ఆర్థిక అసమానతలు, రాజకీయ భాగస్వామ్యం వంటి అంశాలపై విశ్వసనీయమైన గణాంకాలతో అధ్యయనాలు జరగాలి. పరిశోధకులు, న్యాయ నిపుణులు, ఆర్థికవేత్తలు, విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు, యువత కలిసి ప్రభుత్వాల ముందు స్పష్టమైన విధాన ప్రతిపాదనలు ఉంచగలిగే జాతీయ మేధో వేదిక ఏర్పడాలి. బీసీ యువత కేవలం ఉద్యమాల్లో పాల్గొనేవారిగా కాకుండా పరిశోధకులుగా, విధాన పరిపాలకులుగా, విధాన రూపకర్తలుగా ఎదగాలి.

బీసీలకు నాయకులు లేరని కాదు; వివిధ ప్రాంతాల్లో అనేక నాయకత్వాలు ఉన్నాయి. బీసీలకు సంఘాలు లేవని కాదు; వందలాది సంఘాలు పనిచేస్తున్నాయి. కానీ ఆ నాయకత్వాలను, సంఘాలను ఒకే సామాజిక న్యాయ లక్ష్యం కింద సమన్వయం చేసే వ్యవస్థ బలపడాల్సి ఉంది. ఇది మరో కుల సంఘాన్ని స్థాపించే అంశం కాదు. ఉన్న సంస్థల మధ్య పరస్పర గౌరవం, సమన్వయం, ఉమ్మడి కార్యాచరణను నిర్మించే ప్రయత్నం కావాలి. బీసీల ప్రశ్న ఒక కులానికి లేదా ఒక రాష్ట్రానికి మాత్రమే సంబంధించినది కాదు. ఇది భారత ప్రజాస్వామ్యంలో సమాన అవకాశాలు, సామాజిక ప్రాతినిధ్యం, అధికార పంపిణీకి సంబంధించిన ప్రశ్న. జనాభా బలం సంస్థాగత శక్తిగా మారాలి. సంస్థాగత శక్తి రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచాలి. ఆ ప్రాతినిధ్యం నిర్ణయాధికారంలో భాగస్వామ్యాన్ని కల్పించాలి. జనాభాలో మెజారిటీగా ఉండటం మాత్రమే సరిపోదు; తమ హక్కుల కోసం దేశం వినేలా, విధానాలు స్పందించేలా ఒక ఐక్యమైన గొంతుకను నిర్మించుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.



బోడెగ మహేశ్ గౌడ్
పరిశోధక విద్యార్థి, ప్రజా పరిపాలన విభాగం, ఉస్మానియా విశ్వవిద్యాలయం

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9493541919.
Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.